త్రినయనీ.. కాత్యాయనీ

వైభవంగా నవరాత్రులు

విశేష అలంకరణలో అమ్మవార్ల వైభోగం

దేవీ వైభవం



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 4 : జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. జగన్మాత ఒక్కో ఆలయంలో ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమిస్తోంది. విశేష అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, పూలంగి, పల్లకీ సేవలు జరుగుతున్నాయి. దసరా ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు భవానీ అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. భక్తుల భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అన్నపూర్ణాదేవిగా కటాక్షించింది. మూలస్థానేశ్వరాలయం లోని భువనేశ్వరీదేవికి నవావరణ పూజ, త్రిపుర సుందరీదేవి అలంకారం జరిగాయి. పెనుశిల కోనలోని ఆదిలక్ష్మి, జొన్నవాడ కామాక్షమ్మ, కావలి కలుగోళ శాంభవి అమ్మవార్లు విశేష అలంకరణల్లో భక్తుల పూజలందుకున్నారు.



కావలి : బాలాత్రిపురసుందరీదేవిగా కలుగోళశాంభవి



నెల్లూరు : అన్నపూర్ణాదేవిగా ఇరుకళల పరమేశ్వరి



నెల్లూరు : భవానీగా రాజరాజేశ్వరి అమ్మవారు



బుచ్చిరెడ్డిపాళెం : త్రిపురాంబికాదేవిగా కామాక్షితాయి



రాపూరు : పెంచలకోనలో ఆదిలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మి

డీఎఫ్‌వోగా మహబూబ్‌బాషా

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 4: జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో)గా కే.మహబూబ్‌బాషా(ఐఎఫ్‌ఎస్)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఇక్కడ డీఎఫ్‌వోగా ఉన్న చంద్రశేఖర్‌ను ఇప్పటికే అనంతపురం సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో గుంటూరు డీఎఫ్‌వోగా ఉన్న ఆయనను నెల్లూరుకు బదిలీ చేశారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

టెట్ పరీక్షలకు 953 మంది హాజరు

నెల్లూరు (విద్య) : ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్షకు (టెట్) రెండవరోజు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 953 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నెల్లూరు, కావలిలో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరుగుతున్న పరీక్షలకు 1,980 మంది అభ్యర్థులకు 953 మంది హాజరయ్యారు. 136 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలను జిల్లా పరిశీలకుడు, రాష్ట్ర ఓపెన్‌స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, డీఈఓ రామారావు, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

పరిశోధనల అభివృద్ధికి రూ.6 కోట్లతో కార్పస్ ఫండ్

● రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రామ్మోహన్‌రావు



వర్సిటీ అధికారులతో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

వెంకటాచలం : విద్యార్థుల ప్రయోజనాల కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు అభివృద్ధి చేయడానికి రూ.6 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కే రామ్మోహన్‌రావు తెలిపారు. కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి నైనజీర్ అహ్మద్‌తో కలిసి ఆయన సందర్శించారు. వర్సిటీ బోధన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సమష్టి కృషితో వీఎస్‌యూ న్యాక్‌లో మంచి ర్యాంక్ సాధించిందని, ఎన్ఐఆర్ఎఫ్‌లో కూడా మంచి ర్యాంకు సాధించేందుకు వర్సిటీ యంత్రాంగం కృషి చేయాలన్నారు. బోధన సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించేందుకు వర్సిటీ స్థాయిలో ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రూ.2.5 లక్షలు మంజూరు చేస్తున్నామని, ఇందుకోసం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వీఎస్‌యూ వీసీ సారంగం విజయభాస్కర్‌రావు, అన్ని విభాగాల అధిపతులతో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కే.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

3,500 ఎకరాల విస్తీర్ణంలో 1,500 ఎకరాలు కబ్జా

నెల్లూరు చెరువును

అధికారుల విచారణలో విస్తుపోయే నిజాలు

చెరబట్టారు!

నెల్లూరు చెరువు.. దీనినే స్వర్ణాల చెరువు అని కూడా అంటారు. ఒకప్పుడు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఈ చెరువు ఇప్పటికీ నగరవాసుల దాహం తీరుస్తోంది. భూగర్భ జలాలను పెంపొందిస్తోంది. ప్రతిష్ఠాత్మకమైన బారాషాహీద్ దర్గా ఆవరణలో జరిగే రొట్టెల పండుగకు వేదికగా నిలుస్తోంది. ఆహ్లాదపరంగానూ నగరవాసులకు ఓ వరంలా ఉంది. అంతటి ప్రాముఖ్యత కలిగిన నెల్లూరు చెరువు కబ్జారాయుళ్ల చేతిలో బక్కచిక్కిపోతోంది. ఓ వైపు పొలాలుగా మారిపోయి పంటలు సాగవుతున్నాయి. మరోవైపు లేఅవుట్లు వేసి, అంకణాలు చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వే చేసి, 1500 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. కానీ ఆక్రమణదారులపై తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. దీనివెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి





లేక్‌వ్యూ కాలనీ దిగువున చెరువును ఆక్రమించి వెలసిన ఇళ్లు



నెల్లూరు నగరానికి పడమర వైపు ఉన్న నెల్లూరు చెరువుకు ఎంతో విశిష్టత ఉంది. సహజ వనరులతో ఏర్పాటైన ఈ చెరువు విస్తీర్ణం 3500 ఎకరాలు. నీటి నిల్వ సామర్థ్యం 0.80 టీఎంసీలు. నగరంలో దాదాపు పది లక్షల మంది ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేది ఈ చెరువే. అలాంటి ప్రధాన జలవనరు కొంతకాలంగా ఆక్రమణల పాలవుతోంది. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో నెల్లూరు నగరం ఉండగా, అక్కడ కొంచెం కొంచెంగా చెరువును పూడుస్తూ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ చెరువును ఆక్రమించి కొన్ని లేఅవుట్లు కూడా వేయడం గమనార్హం. ఇక పడమర భాగాన కొండ్లపూడి గ్రామం ఉంది. అక్కడ వందల ఎకరాల చెరువును ఆక్రమించి సాగు చేస్తున్నారు. కొంత భూమిలో వరి సాగు, మరికొంత చెరువులో చేపల గుంతలు ఉన్నాయి. ఈ ఆక్రమణల పర్వం ఏటికేడు పెరుగుతూ వస్తోంది. ఉత్తర భాగాన జొన్నవాడ రోడ్డు ఉంది కాబట్టి సరిపోయింది లేకుంటే.. ఆ వైపు కూడా ఆక్రమణలు జరిగేవనడంలో సందేహం లేదు.

● **1500 ఎకరాలు ఆక్రమణ**

నెల్లూరు చెరువు ఆక్రమణలకు గురవుతూ ప్రమాదంలో పడింది. ఆ ప్రమాదం నగరానికీ పొంచి ఉంది. అందులోనూ గడిచిన నాలుగైదేళ్లుగా ఆక్రమణల జోరు పెరిగింది. దీంతో ప్రజల నుంచి ఫిర్యాదులు, ఆందోళనలు ఎక్కువయ్యాయి. ఇటీవల ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించారు. దాదాపు 1500 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. ఇంత భారీస్థాయిలో ఆక్రమణలు జరగడంతో అధికారులు కూడా విస్తుపోయారు. లేక్‌వ్యూకాలనీ, వెంగళరావు నగర్, టైలర్స్ కాలనీ వంటి ప్రాంతాల్లో కొన్ని వేల ఇళ్లు చెరువులో నిర్మితమయ్యాయి. అలానే టైలర్స్ కాలనీ, అక్కచెరువుపాడు ప్రాంతాల్లో చెరువును ఆక్రమించి కొన్ని లేఅవుట్లు కూడా వేశారు. తొమ్మిది అంకణాల చొప్పున విభజించి ఒక్కో ప్లాటును రూ.రెండు, మూడు లక్షలకు అమ్మేస్తున్నారు. ఇక పడమర ప్రాంతాల్లో ఏకంగా చెరువులో సాగు చేస్తున్నారు. కొండ్లపూడి-అక్కచెరువుపాడు రోడ్డుపై నిలబడి చూస్తే ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.

● **అడ్డుకోవడంలో వైఫల్యం**

నెల్లూరు చెరువులో ఆక్రమణలను అడ్డుకోవడంలో అధికార యంత్రాంగం పలమైందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇరిగేషన్ శాఖ పర్యవేక్షణలో ఈ చెరువు ఉండగా, వారు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తారు. ఆక్రమణలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తేగానీ స్పందించరు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులకు లేఖ రాయడం, వారు ఆ లేఖకు స్పందించేసరికి చెరువులో ఇంటి నిర్మాణం కూడా పూర్తవుతుంది. ఒకవేళ అధికారులు వేగంగా స్పందించి ఆక్రమణలు అడ్డుకునేందుకు వెళ్లిన సందర్భంలో ఎవరో ఒక రాజకీయ నాయకుడి నుంచి ఫోన్ వస్తుంది. దీని మూలంగానే ఆక్రమణలకు బ్రేక్ పడడం లేదు. పడమర వైపు చేపల చెరువులు సాగు చేస్తూ ఆ హానికరమైన నీటిని నెల్లూరు చెరువులోకి వదులుతున్నా పట్టించుకోవడం లేదు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఉమ్మడి సర్వే చేసి ఆక్రమణలు గుర్తించినా వాటిని తొలగించే సాహసం చేయలేకపోతున్నారు. అందుకు రాజకీయ ఒత్తిళ్లే ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు.



ఆత్మకూరు బస్టాండు వద్ద అండర్ బ్రిడ్జిలో వర్షపునీరు, మురుగునీరు

మోస్తరు వర్షానికే నరకం!

● నగర రోడ్లన్నీ జలమయం

● అండర్‌బ్రిడ్జిల వద్ద ప్రజల అవస్థలు

భారీ వర్షాలు ఇంకా ప్రారంభం కాలేదు. తుఫాన్ల ప్రభావం ఇంకా జిల్లాపై పడలేదు. అయితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి కురిసిన తేలికపాటి వర్షానికే రోడ్లు జలమయం అయ్యాయి. ఆత్మకూరు బస్టాండు, వీఆర్‌సీ కూడలి వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జీలలో వర్షపునీటితోపాటు మురుగునీరు ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అలాగే పలు ప్రాంతాల్లోని అనేక వీధుల్లోనూ మోకాలిలోతు నీళ్లు నిలబడ్డాయి. దీంతో ప్రజలు, వాహన దారులు తీవ్రఅవస్థలు పడ్డారు. మోస్తరు వర్షానికే ఇలా అయితే ఇక భారీ వర్షాలు వస్తే పరిస్థితి ఏమిటంటూ నిట్టూర్చారు. అలాగే వరికుంట పాడు, కావలి, జలదంకి తదితర ప్రాంతాల్లోనూ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)



జొన్నలగడ్డవారి వీధిలో వర్షపు నీరు

టెండర్లు త్వరగా వేసేయండి.. లేకుంటే టెక్నికల్ ఇబ్బందులు రావొచ్చు!

● వ్యాపారులకు ఎక్సైజ్ అధికారుల ఫోన్లు?

● 4 రోజుల్లో వేసింది పదిలోపు టెండర్లే!

నెల్లూరు (క్రైం), అక్టోబరు 4 : నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు వైన్‌షాపుల ఏర్పాటు కోసం టెండర్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. దీంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులే కొంతమంది వ్యాపారులకు ఫోన్లు చేసి టెండర్లు త్వరగా వేయాలని, గడువు సమీపించే తరుణంలో టెక్నికల్ సమస్యలు తలెత్తే అవకాశం ఉండొచ్చని చెబుతున్నట్లు సమాచారం. కాగా, వైన్‌షాపుల ఏర్పాటుకు ఈ నెల 1వ తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లావ్యాప్తంగా 182 షాపులకు ఈ నెల 1 నుంచి 9వ తేదీ సాయంత్రం వరకు టెండర్లు దాఖలు చేయాలని వ్యాపారులకు పిలుపునిచ్చారు. ఇప్పటికి 4 రోజులు పూర్తయినా 10 లోపు టెండర్లు వేసినట్లు తెలుస్తోంది. ఇక మిగిలింది ఐదు రోజులే కావడంతో ఎన్ని దుకాణాలకు ఎన్ని టెండర్లు దాఖాలు అవుతాయోనని ఎక్సైజ్ అధికారుల్లో ఉత్కంఠ నెలకొంది.

పరిశ్రమలకు ప్రాణం పోయాలి

● జిల్లాల పునర్విభజనతో కుదేలైన పారిశ్రామికాభివృద్ధి

● గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో మరింత డీలా!

● నిరుద్యోగుల ఆశలన్నీ రెండు పోర్టుల పైనే

● కేంద్ర ప్రభుత్వ సహకారం అవశ్యం

● ఎంఎస్ఎంఈలపై దృష్టి పెట్టాలి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 4 : పరిశ్రమలు ప్రగతికి సోపానాలు అంటారు. అలాంటి పారిశ్రామిక రంగానికి జిల్లాలో జవసత్వాలు లేకుండా పోయాయి. రాష్ట్రంలోనే రెండవ పారిశ్రామక హబ్‌గా ఉన్న నెల్లూరు జిల్లా ప్రస్తుతం చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేక కుదేలైంది. గత వైసీపీ ప్రభుత్వం చేసిన జిల్లాల పునర్విభజన వల్ల వేల సంఖ్యలో పరిశ్రమలు ఉన్న నాయుడుపేట, గూడూరు ప్రాంతాలు తిరుపతి జిల్లాలో కలిసిపోయాయి. దీంతో ప్రస్తుత నెల్లూరు జిల్లా పారిశ్రామకంగా వెనకబడినట్లైంది. జిల్లాలో ప్రస్తుతం 9 అతి భారీ పరిశ్రమలు, 33 భారీ పరిశ్రమలు, 18,167 ఎంఎస్ ఎంఈ పరిశ్రమలు ఉన్నాయి. వీటిద్వారా సూమారు 2లక్షల మంది ఉపాధి పొంది ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో పారిశ్రామిక అభివృద్ధి పూర్తిగా కుంటుబడి పోయింది. కేవలం కృష్ణపట్నం పోర్టు ఆధారంగా కొన్ని పరిశ్రమలు నూతనంగా ఏర్పాటు అవుతున్నాయి. ఇటీవల కాలంలో కావలి వద్ద గల రామాయపట్నం పోర్టును అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్య చరణ రూపొందించింది. నాలుగు బెర్తులతో రూ.3700 కోట్ల అంచనాతో అభివృద్ధి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ పోర్టుకు సమీపంలో మోగా ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటుకు ఏపీఐఐసీ ఇప్పటికే 2500 ఎకరాల భూసేకరణకు చర్యలు ప్రారంభించింది.

ఆశలన్నీ రెండు పోర్టులపైనే

జిల్లాలోని కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులను అభివృద్ధి చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న సీబీఐసీ (చెన్నై - బెంగళూరు ఇండ్రస్ట్రియల్ కారిడార్)ను అభివృద్ధి చేస్తే జిల్లాకు పలు భారీ పరిశ్రమలు వచ్చే అవకాశాలున్నాయి. రామాయపట్నం పోర్టును కేంద్ర ప్రభుత్వ సహకారంతో త్వరితగతిన అభివృద్ధి చేయడం వల్ల దానికి అనుగుణంగా భారీ పరిశ్రమలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జిల్లాలో సముద్రతీర ప్రాంతం ఎక్కువగా ఉండటంతో అందుకు అనుసంధానంగా పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్లు సమాచారం.

నగరానికి చేరుకున్న కేంద్ర సహాయ మంత్రి

● నేడు నగరంలో విస్తృత పర్యటన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శుక్రవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు. ఆయనకు జిల్లా అధికారులు, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. శనివారం ఉదయం శాంతి నగర్‌లోని దివంగత మాగుంట పార్వతమ్మ నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. అనంతరం ట్రంకు రోడ్డులోని శివాజీ సెంటర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్ర మంలో పాల్గొంటారు. ఆ తర్వాత వీఆర్‌సీ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన సీఫుడ్స్ మేళాలో కేంద్ర సహాయ మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు సంతపేటలోని ప్రభుత్వ మోడల్ హైస్కూల్ వద్ద ఉన్న బీజేపీ నేత యశ్వంత్‌సింగ్ నివాసానికి వెళతారు. అక్కడ నుంచి బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగే సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొంటారు. అనంతరం తిరుపతికి పయనమవుతారు.

ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఖాళీ ప్లాట్లు

గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో జిల్లాలోని పలు ఎంఎస్ఎంఈ పార్కులు నిరాదరణకు గురయ్యాయి. వాటిలోని ప్లాట్లు కొనేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపలేదు. దీంతో కేకేగుంట, బొడ్డువారిపాళెం, నారంపేట పార్కుల్లో 70శాతం ప్లాట్లు అమ్ముడుపోక ఖాళీగా ఉన్నాయి. వెంకటాచలం పారిశ్రామికవాడలో పరిశ్రమల కోసం తీసుకున్న స్థలాల్లో దాదాపు 50 శాతం ప్లాట్లు ఖాళీగా ఉంచారు. ఇక ఆమంచర్ల ప్రాంతంలోని దాదాపు 500 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు రెవెన్యూ శాఖ నుంచి భూమి కొనుగోలు చేస్తే ఆ స్థలం తమదని అటవీ శాఖ అధికారులు అడ్డుకొని నిలిపివేశారు. ఇలా జిల్లాలోని ఎంఎస్ఎంఈ పార్కులన్నీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఆత్మకూరు మండలం నారంపేటలోని ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీయల్ పార్కు

కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే..


ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిచాల్సిన అవసరం ఉంది. కేంద్ర పథకాలతోపాటు పోర్టుల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంది. కాగా, త్వరలో రానున్న నూతన పారిశ్రామిక పాలసీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేలా, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ఉండాలని యువత ఆశిస్తోంది.

కామ్మో.. ఘాటా!?

- రాపూరు-చిట్వేలు రోడ్డు అంటనే హడల్
- తరచూ ప్రమాదాలతో వాహనదారుల బెంబేలు
- రోడ్డు విస్తరణను విస్మరించిన పాలకులు



దెబ్బతిన్న మార్జిన్ గుంతలో వర్షపు నీరు



రోడ్డుపై గుంతలు



ఈ రోడ్డుపై వాహనం నడిపేదెలా





కొంచెం ఏమరుపాటుగా ఉంటే లోయలోకే..



ప్రమాదకర మలుపులో దెబ్బతిన్న రోడ్డు, కమ్మేసిన చెట్లు

రెండు జిల్లాలను కలుపుతూ వెలుగొండ అడవి మధ్యలో సాగే ప్రధాన రహదారి ఇది. చుట్టూ పొడవైన చెట్లు.. ఒళ్లు గగుర్పొడిచే లోయలు.. సెలయేరు మధ్య సాగే ఈ రోడ్డు అంటే వాహనదారులు హడలి పోతున్నారు. నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే రాపూరు-చిట్వే లు రోడ్డు ఇరుకుగా ఉంటోంది. అలాగే మార్జిన్ పూర్తిగా ధ్వంసం కావడంతో కార్లు, ద్విచక్రవాహనారులు తరచే ప్రమాదాల బారిన పడుతున్నారు. దట్టమైన చెట్లు రోడ్డును కమ్మేయడంతో ఎదుట వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఓవర్‌టేక్, సైడ్ తీసుకునే సమయంలో చెట్ల కొమ్మలు తగిలి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. సూచక బోర్డులు ఉన్నా చెట్ల మధ్యలో ఉండటంతో అగుపించడం లేదు. ఇక రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల ఈ ఘాట్‌లో రెండు చోట్ల ప్రమాదాలు జరగడంతో వాహనదారులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. తెల్లవారుజాము వరకు వాహనాలు ఇరువైపులా ఆగిపోయాయి. లోయవైపు నిర్మించిన పిట్టగోడలు సైతం పూర్తిగా ధ్వంసం అయ్యాయి. గత వైసీపీ సర్కారు ఈ ఘాట్ రోడ్డును పూర్తిగా విస్మరించగా కూటమి ప్రభుత్వమైనా బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- రాపూరు



కనిపించని సూచిక బోర్డు

పొదలకూరులో ఇసుక దోపిడీ రూ.91 కోట్లు

- ఏ1 కాకాణి
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



పెనాల్టీ పత్రాలు చూపిస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): 'పొదలకూరు మండలంలోని విరువూరు, సూరాయపాలెం ఇసుక రీచ్‌లలో భారీ దోపిడీ జరిగినట్లు అధికారుల విచారణలో నిర్ధారణైంది. సూరాయపాలెంలో 2,73,500 టన్నుల ఇసుకను అక్రమంగా దోచుకెళ్లగా అందుకు రూ.54.70 కోట్లు పెనాల్టీ విధించారు. అలానే విరువూరులో 1,85,000 టన్నులు అక్రమంగా తరలించగా అందుకుగాను రూ.37 కోట్లు పెనాల్టీ విధించారు. అంటే ఒక్క పొదలకూరు మండలంలోనే రూ.91.70 కోట్ల విలువైన ఇసుక దోపిడీ జరిగినట్లు తేలింది. ఇది కేవలం 2023 డిసెంబరు నుంచి 2024 జూన్ 4వ తేదీ మధ్య జరిగిన దోపిడీ మాత్రమే. ఇక వైసీపీ ప్రభుత్వంలో మిగిలిన నాలుగన్నరేళ్లలో ఎన్ని వందల కోట్ల దోపిడీ జరిగిందో ఊహించుకోవచ్చు' అంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూరాయపాలెం, విరువూరు రీచ్‌లలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు విచారణ జరిపి విధించిన పెనాల్టీ డాక్యుమెంట్లను మీడియాకు విడుదల చేశారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ ఆ రెండు రీచ్‌లలో జేపీ వెంచర్స్‌తో కలిసి విరువూరుకు చెందిన వైసీపీ నేత బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి అక్రమంగా ఇసుక తరలించినట్లు విచారణలో తేలిందని చెప్పారు. వైసీపీ పాలనలో కాకాణి గోవర్ధన్‌రెడ్డికి తెలియకుండా ఇసుక రేణువు కూడా కదిలే అవకాశం లేదని, ఈ దోపిడీలో ఏ1 కాకాణినే అని సోమిరెడ్డి ఆరోపించారు. నిత్యం సూరాయపాలెంలో రూ.100 కోట్ల దోపిడీ అంటూ పాటపాడే కాకాణి దోపిడీ పర్వం అధికారికంగా వెలుగులోకి వచ్చిందని అన్నారు. తాను కాకాణిలా నోటికొచ్చినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని, ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారులు ఇచ్చిన నోటీసులు, సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన డాక్యుమెంట్ల ఆధారంగానే మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. ఒక్క ఇసుకే కాదని, మట్టి, గ్రావెల్, క్వార్ట్జ్ ఇలా ఏ ఖనిజాన్నీ వదలకుండా దోచుకున్నారని విమర్శించారు. రైతుల పేర్లతో అనుమతులు పొంది సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువుల్లో 5.75 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను లేఅవుట్లకు అమ్ముకొని రూ.వందల కోట్లు సొమ్ము చేసుకున్నారని చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ప్యాలెస్‌లో కూర్చుని కలెక్షన్లు లెక్కపెట్టుకుంటూ సర్వేపల్లిని సర్వనాశనం చేసిన వ్యక్తి తమపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగే వరకూ వదిలే ప్రసక్తే లేదన్నారు. దోచిన సొత్తును వడ్డీతో సహా కట్టిస్తామని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.

తారు డబ్బాల చోరీ దొంగల అరెస్టు

- రూ.1.50లక్షల తారు డబ్బాలు స్వాధీనం
- 48 గంటల్లో కేసును ఛేదించిన కావలి రూరల్ పోలీసులు

కావలి రూరల్, అక్టోబరు 4: రుద్రకోట తారు మిక్సింగ్ ప్లాంట్‌లోని తారు డబ్బాలు చోరీ చేసిన దొంగలు తిరుపతి శివయ్య, హరిక్రిష్ణలను గౌరవరం వద్ద శుక్రవారం రూరల్ పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. వీరు పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన వారుగా నిర్ధారించారు. ఈ సందర్భంగా వారు చేవూరు సమీపంలోని అటవీప్రాంతంలో దాచి ఉంచిన రూ.1.50లక్షల విలువ గల తారు డబ్బాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ముద్దాయిలపై ప్రత్యేక నిఘా ఉంచి 48 గంటల్లో కేసును ఛేదించినట్లు ఎస్ఐ తిరుమల రెడ్డి తెలిపారు. తారు మిక్సింగ్ ప్లాంట్‌లో తారు డబ్బాలు చోరీ జరిగినట్లు ప్లాంట్ యజమాని దశరథరామిరెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారని, ఆ మేరకు పాత నేరస్తులైన ముద్దాయిలపై నిఘా ఉంచామన్నారు.

గంజాయి ముఠా అరెస్టు



గంజాయి ముఠాతో పోలీసులు

కోవూరు, అక్టోబరు 4: కోవూరు నందలగుంట కాలనీలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన వివరాలు వెల్ల డించారు. ఎస్ఐ రంగనాథ్ గౌడ్‌కు అందిన సమాచారంతో ఆయన సిబ్బందితో కలిసి నందలగుంట సమీపంలో నిఘా ఉంచారు. ఈ క్రమంలో నెల్లూరు నగరానికి చెందిన చుక్కల శంకరనారాయణ, షేక్ మఫిత్ స్కూటర్‌పై కోవూరు వైపు వస్తుండగా నిలిపి తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న కిలో గంజా యిని స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో నందలగుంట ప్రాంతంలోని జగనన్న న్యూ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో దాడులు చేసి గంజాయి ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న నెల్లూరు నగరానికి చెందిన పసుపులేటి రవి, చీమకుర్తి సుజిత్ లను అరెస్టు చేశారు. వారి నుంచి 9 కిలోల గంజా యిని తహసీల్దారు నిర్మలానంద బాబా సమక్షంలో స్వాధీనం చేసుకు న్నారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచ నున్నట్లు సీఐ వివరించారు. సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో గంజాయి వినియోగం, అక్రమణ రవాణా, అమ్మకాల గురించి సమాచారం తెలిపిన వ్యక్తులకు ప్రభుత్వం పారితోషకం అందిస్తుందన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7328
వెండి కిలో ధర	రూ. 93,500
వెండి ఒక గ్రాము	రూ. 96.50

క్షయ, కుష్ఠు నివారణకు చర్యలు చేపట్టాలి

నెల్లూరు (వైద్యం): జిల్లాలో క్షయ, కుష్ఠు వ్యాధుల నివారణ చర్యలు సమర్థవంతంగా చేపట్టాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. క్షయ, కుష్ఠు వ్యాధుల నివారణకు ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయ వ్యాధి రాకుండా పెద్దలకు బీసీజీ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆశా కార్యకర్తను విధుల్లోకి తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రెహనాబేగం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 4 : కలిగిరి మండలం రావులకొల్లు గ్రామ ఆశావర్కర్ పందిటి విజయమ్మను విధుల్లోకి తీసుకోవాలంటూ ఆశావర్కర్స్ యూనియన్ శుక్రవారం కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేపట్టింది. ఈ దీక్షలను సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం ప్రారంభించారు. రాజకీయ కక్ష సాధింపుతో విజయమ్మను అక్రమంగా విధుల నుంచి తొలగించారన్నారు. కలెక్టర్‌కు అన్ని విషయాలు చెప్పినా ఆమెకు న్యాయం జరుగలేద న్నారు. వెంటనే ఆశాను విధుల్లోకి తీసుకోకపోతే ప్రజాసంఘాలతో కలుపుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, కోశాధికారి మధుసూదనమ్మ, సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు

- సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నేతలు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 4 : విశాకు ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ప్రయత్నాలను వెంటనే ఆపాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ నగర సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య మాట్లాడుతూ ఆదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు బీజేపీ బానిసలా మారుతూ దేశ సంపదను దోచి పెడుతోందని విమర్శించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దింపి తిరు మల లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు షానవాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయండి

- దక్షిణ మధ్య రైల్వే బోర్డు సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి



రైల్వే బోర్డు సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 4 : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. గురువారం విజయవాడలోని ఈటీటీ సెంటర్‌లో దక్షిణ మధ్య రైల్వే బోర్డు సమావేశం జరిగింది. ఇం దులో ఆయన జిల్లాలో రైల్వేల దుస్థితిని, వాటికి సంబంధించిన అభి వృద్ధి అంశాలను తెలియజేశారు. స్టేషన్లలో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై దృష్టి సారించా లని కోరారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ ప్రగతి అంశాన్ని కూడా వేమిరెడ్డి ప్రస్తావించారు.

రూ.30 కోట్లతో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

- స్థలం పరిశీలించిన ఈఈ మురళీకృష్ణ



సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఈఈ మురళీకృష్ణ

మనుబోలు, అక్టోబరు 4: మండలంలోని చెర్లోపల్లి రైల్వే గేటు వద్ద సుమారు రూ.30 కోట్లతో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు ఆర్అండ్‌బీ ఈఈ మురళీకృష్ణ తెలిపారు. శుక్ర వారం ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆయన స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ భవిష్యత్తులో రైల్వేశాఖ క్రాసింగ్ గేట్లు తీసివేయనుందన్నారు. ఈ నేపథ్యంలో క్రాసింగ్ గేట్లు ఉన్నచోట వంతెనల నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందన్నారు. సుమారు 800 మీటర్ల మేరకు రైల్వే ఫ్లై ఓవర్ వంతెన రాబోతుందన్నారు. ఈ దూరంలో ఉన్న భూముల స్థితిగతులపై సర్వే చేస్తామన్నారు. అందులో ప్రభుత్వ, పట్టా భూములు గుర్తించి రెవెన్యూ అధికారులు సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. తద్వారా పట్టా భూముల రైతులకు ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. భూసేకరణ, సర్వే, నష్టపరిహారం పూర్తయితే నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. దీనిపై రెవెన్యూతో పాటు దాని అనుబంధశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు బషీర్, ఏవో జహీర్, ఉద్యానశాఖ అధికారి ఆనంద్, ఏఈ కసనానాయక్, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో శుభ్రతేది?

- ఎంహెచ్‌వోపై పురపాలక మంత్రి నారాయణ ఆగ్రహం
- సిటీ నియోజకవర్గంలో ఆకస్మిక పరిశీలన



చెత్త పేరుకున్న కాలువను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), అక్టోబరు 4 : 'ఆ రోడ్డేంది అలా ఉంది?, ఇక్కడ శుభ్రత ఎక్కడుంది?, ఈ కాలువలో ఏమిటీ వ్యర్థాలు?, అసలు పూడిక తీస్తున్నారా?, మీరసలు నగరంలో తిరుగుతున్నారా? ఇలాగైతే నా దగ్గర కుదరదు!' అంటూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు కార్పొరేషన్ ఆరోగ్య అధికారి చైతన్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిటీ నియోజకవర్గ పరిధిలోని 3, 45 డివిజన్లలో ఆయన, కమిషనర్ సూర్యతేజతో కలిసి పారిశుధ్య నిర్వహణను ఆకస్మికంగా పరిశీలించారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు, మంత్రి స్వయంగా పరిశీలించడంతో పారిశుధ్య నిర్వహణలో లోపాలు బయటపడ్డాయి. క్షేత్ర స్థాయిలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాల్సిన ఎంహెచ్‌వో వైఫల్యం చెందుతున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీలు పూర్తయ్యాక తిరిగి వెళుతూ ఆకుతోట హరిజనవాడ వద్దనున్న హైవే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డుపైనున్న మట్టికుప్పలను చూసి మరోసారి అధికారులపై మంత్రి ఆగ్రహించారు.

ఆరునెలల్లో ప్రతీ ఇంటికి తాగునీరు

నెల్లూరులోని ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీటిని మరో ఆరు నెలల్లో అందిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు. కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు ప్రణాళికలు తయా రు చేస్తున్నట్లు చెప్పారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మ తులు చేసేందుకు పది రోజుల్లో టెండర్లు పిలుస్తామని తెలిపారు. నగరంలో పచ్చ దనాన్ని పెంచేందుకు ఆసక్తి గల వారిని ఆహ్వానిస్తున్నా మన్నారు. నెల్లూరులో స్థలాల రిజిస్ట్రేషన్ సమస్య ఉందని, దానిని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొ న్నారు. అనంతరం ఇంజనీరింగ్, సిటీప్లానింగ్, సర్వే విభాగాలపై మంత్రి మరో సమీక్ష నిర్వహించారు.

పెన్నాలో యువతి మృతదేహం



నదిలో ఆషా మృతదేహం

నెల్లూరు (క్రైం), అక్టోబరు 4: నెల్లూరులోని రంగనాథ స్వామి ఆలయం వెనుకవైపు పెన్నా నదిలో ఓ యువతి మృత దేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. పోలీసుల సమా చారం మేరకు... నగర శివార్ల లోని టైలర్స్‌కాలనీలో బేల్దారి మస్తాన్ కుటుంబం నివసిస్తోంది. ఆయ నకు భార్య, ఇద్దరు కుమార్తెలు న్నారు. పెద్ద కుమార్తె బెంగళూ రులో ఉద్యోగం చేస్తుండగా చిన్న కుమార్తె ఆషా(21) బీబీఎం పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తోంది. ఆమె ఇటీవల తిరుపతిలో ట్రైనింగ్ పూర్తి చేసుకుని వచ్చింది. ఉద్యోగ పని నిమిత్తం వెళుతున్నా నని చెప్పి గురువారం ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఆ తర్వాత ఏం జరిగిం దోగానీ తెలియదుగానీ పెన్నానదిలో మృతదేహంగా మారింది. శుక్రవారం ఉద యం ఆమె మృతదేహం నీటిలో తేలి యాడటాన్ని గమనించిన స్థానికులు ఆ ప్రాంత వీఆర్వో నరేంద్రకు సమాచారం అందించారు. ఆయన సంతపేట పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదేహాన్ని నది నుంచి వెలికితీయిం చారు. బాధిత కుటుంబ సభ్యులకు సమా చారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువతి పెన్నాలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

కుమారుడిని కాపాడేందుకు భర్తపై భార్య దాడి

- అక్కడికక్కడే భర్త మృతి

నెల్లూరు (క్రైం), అక్టోబరు 4: కుమారుడిని కాపాడుకునే క్రమంలో ఓ మహిళ రోకలిబండతో భర్తపై దాడి చేసింది. తలకు తీవ్ర గాయమై భర్త అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి నెల్లూరులోని మెక్లీన్స్‌రోడ్డులో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మెక్లీన్స్‌రోడ్డు హందా మజీద్ సమీపంలో షేక్ సుభానీ(48), కౌసర్‌బేగం దంపతులు నివసిస్తున్నారు. వారికి మువాజ్, సోను, ఎలియాజ్ సంతానం. సుభానీ సోఫాలు కుట్టే పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరు నెలలుగా మద్యానికి బానిసై ఆ మత్తులో భార్య, కుమారులతో నిత్యం గొడవపడేవాడు. గురువారం రాత్రి కూడా ఇలాగే గొడవపడ్డాడు. పెద్దకుమారుడు మువాజ్ వారిస్తుండగా కోపోద్రిక్తుడైన సుభాన్ రోకలిబండతో మువాజ్‌పై దాడికి యత్నించారు. ఇది చూసిన కౌసర్ బేగం బలవంతంగా భర్త చేతిలో నుంచి రోకలిబండను లాక్కుంది. దీంతో సుభానీ కత్తితో కుమారుడిని పొడవబోతుండగా కౌసర్ రోకలిబండతో భర్త తలపై బలంగా మోదింది. సుభానీ తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై చిన్నకుమారుడు ఎలియాజ్ శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి

నెల్లూరు రూరల్, అక్టోబరు 4 : మండల పరిధిలోని సౌత్‌మోపూరు గ్రామ పంచాయతీ మొగళ్లపాళెం వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు వాహనాలు, రూ.2.26 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జీ వేణు తెలిపారు. కేసు నమోదు చేస్తున్నామని చెప్పారు.


ఆత్మకూరు: బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో జ్వాలాముఖి అమ్మవారు


దుత్తలూరు గుంతబజార్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


వరికుంటపాడు : బ్రహ్మచారిణి అలంకరణలో మానసాదేవి

దేవీ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్ల దర్శనం

ఆత్మకూరు, అక్టోబరు 4: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వివిధ రూ పాల్లో ఆదిమాత దర్శనం ఇవ్వడంతో భక్త జనం పరవశించి పోయారు. దేవీ నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆత్మకూరు పట్టణం లోని శివాలయంలో చండీ దేవి అలంకారంలో ఆదిమాత భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆల యం, తిరునాళ్ళతిప్పలోని కాశీ నాయన ఆశ్రమ ఆవరణలో కనకదుర్గాదేవి, గాయత్రీ దేవీలు అన్నపూర్ణాదేవి అలంక రణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర బలిజవీధిలో జ్వాలా ముఖి ఆలయంలో శ్రీబాలత్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మ వారు శోభిల్లారు.


కావలి టౌన్: ఆదిలక్ష్మి అలంకరణలో రాజ్యలక్ష్మి

●**ఉదయగిరి రూరల్:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పార్వతీ పరమేశ్వరా లయం, శ్రీసంతానలక్ష్మిదేవి ఆలయాల్లో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుత్తలూరులో: దుత్తలూరు గుంతబజార్‌లో ఎస్ఎస్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారు శుక్రవారం భ్రమరాంబదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●**వరికుంటపాడు:** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో మానసాదేవి ఆలయంలో అమ్మవారు శుక్రవారం బ్రహ్మచారిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వరికుంటపాడులోని నాగరప్పమ్మ ఆలయంలోను అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

●**సీతారామపురం:** శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి శాలలో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. నారాయణంపేటలోని విజయ కనకదురా దేవి ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

●**వింజమూరు** : పట్టణంలోని కొండమీద వెలిసి వున్న విద్యా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రాందేవ్ స్వీట్స్ స్టాల్ వారు వ్యవహరించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

●**లింగసముద్రం:** వాకమళ్లవారిపాలెం అయ్యప్ప స్వామి గుడిలోని కామాక్షిదేవి అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చింది. ఈ సం దర్భంగా నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. లింగసముద్రం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారిని బాలత్రిపుర సుందరి దేవిగా అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు.

●**బిట్రగుంట:** విశ్వనాథరావుపేట రాజరాజేశ్వరి దేవి గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. గంగతిప్పపై వెలసి ఉన్న గంగమ్మకు నూకసాని శ్రీనివాసులు యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. రామస్వామిపాలెంలోని జ్ఞానప్రసూనాంబ సమేత రామలింగేశ్వర ఆలయంలో పూజలు చేశారు.

●**కలిగిరి:** తెల్లపాడు గ్రామంలో భద్రకాళి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉభయదాతలు ఉమ్మడిశెట్టి రామారావు-రాధమ్మ, శేషయ్య- లావణ్య, నాగభూషణం-లక్ష్మి, నాగేశ్వరరావు-చెంచమ్మ దంపతులు కుంకుమార్చన, పూజలు చేయించారు.

●**కావలి టౌన్:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. గ్రామదేవత కలుగోళశాంభవి బాలత్రిపురసుందరి దేవి దర్శన మిచ్చి యళివాహన సేవలందుకున్నారు. పాతూరు శివాలయ దుర్గాభ్రమ రాంబ బ్రహ్మచారిణి అలంకరణలో, విష్ణాలయంలో రాజ్యలక్ష్మీ.. ఆదిలక్ష్మీగా, వడ్డెపాలెం కనకదుర్గాదేవి బాలత్రిపురసుందరిదేవిగా, ముసునూరు మహా లక్ష్మమ్మ బాలత్రిపురసుదరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ముసునూరు హనుమత్ క్షేత్రంలో దుర్గాదేవి బాలత్రిపుర సుందరిదేవిగా కన్పించారు.

●**అల్లూరు:** పట్టణంలోని కన్యకాపరమేశ్వరి సాయంత్రం ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే కలుగోళమ్మ, వేణుగోపాల స్వామి ఆలయంలోని పార్వతి అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి పల్లకీసేవ నిర్వహించారు.

కందుకూరు ఎంపీడీఓగా రత్నజ్యోతి

కందుకూరు, అక్టోబరు 4: మండల ఎంపీడీఓ రత్న జ్యోతి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఓఆర్డీగా బాధ్యతలు నిర్వహించిన ఆమె ప్రస్తుతం ఎంపీడీఓగా నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఏపీఓ సుజాత, టీఏలు హరి నారాయణ, బ్రహ్మనాయుడు, వీరయ్య ఇతర ఉపాధి సిబ్బంది ఆమెను కలిసి అభినందనలు తెలిపారు.

కావలి నూతన ఆర్డీవోగా వంశీకృష్ణ

కావలి, అక్టోబరు 4: కావలి నూతన ఆర్డీవోగా ఎం.వంశీ కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా కదిరి ఆర్డీవోగా పని చేసిన ఇక్కడకి బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మాట్లాడారు. గ్రీవెన్స్ అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పట్టణంలోని ప్రధాన సమస్యలపై మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్‌తో చర్చించారు.

ఉప తహసీల్దారుకు సన్మానం

జలదంకి: బదిలీపై వెళుతున్న మండల ఉప తహసీల్దారు భరత్‌ను కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు సన్మానించారు. ఈయన స్థానంలో బోగోలులో డీటీ జూలీబాయ్, రీ సర్వే డీటీగా శ్యాంసన్ బాధ్యతలు తీసుకున్నారు.

ఎంపీడీవో, ఏఈ బాధ్యతల స్వీకరణ

సంగం, అక్టోబరు 4: సంగం మండల పరిషత్ అధికారిగా కె షాలెట్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అదేక్రమంలో స్థానిక విద్యుత్‌శాఖ ఏఈగా ఉడత మన్మదరావు బాధ్యతలు చేపట్టారు.

సీనియర్ అసిస్టెంట్..

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా కొల్లు వెంకటాద్రి బాధ్యతలు స్వీకరించారు. వెంకటగిరిలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

సీతారామపురం ఎంపీడీవోగా భాస్కర్

సీతారామపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం భాస్కర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

13 మంది ఉద్యోగుల బదిలీ

అనంతసాగరం, అక్టోబరు 4: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న 13 మంది ఉద్యోగులు సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర మండ లాలకు వెళ్లారు. బదిలీ అయిన వారిలో సీనియర్ అసిస్టెంట్ రమేష్, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శులు రమేష్, మోహన్‌కిషోర్, మనోహర్, హేమ లత, వినోద్, శ్రావణి, అటెండర్లు కాశయ్య ఆదెమ్మ ఉన్నారు. వారి స్థానాల్లో కొత్త సిబ్బంది రావల్సివుంది.

బేబి ఒలింపిక్స్ విజేతలకు ప్రశంసల వెల్లువ


తోషన్, తోషిణి (కవలలు)

కావలి టౌన్, అక్టోబరు 4: బేబి ఒలింపిక్స్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన కావలి కవలలు తోషన్, తోషిణిలకు తల్లిదండ్రులు సిద్ధార్థ్ మణికంఠ రూపశ్రీలకు పలువురు నుంచి ప్రశంసలు అందుతున్నాయి. ఇటీవల విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఇంటర్ నేషనల్ సంస్థ డెక్లాథన్ సహకారంతో న్యూ ఇండియా బేబి గేమ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన బేబి ఒలింపిక్స్‌లో 6నెలల నుంచి ఏడాదిలోపు వయసున్న పిల్లల విభాగంలో దోగాడే అంశంలో 9నెలల కవలలు తోషన్ ప్రథమ, తోషిణి ద్వితీయ స్థానాల్లో నిలవడం విశేషం. కావలి చెందిన కవలలు రాష్ట్రస్థాయి బేబి పోటీల్లో పాల్గొని గెలుపొందడం పట్టణానికే కాకుండా జిల్లాకే గర్వకారణమని పట్టణ వైద్యులు, రెడ్‌క్రాస్, రోటరీ, పలువురు ప్రముఖులు తల్లితండ్రులను కొనియాడుతున్నారు.

శిక్షణ అందిపుచ్చుకున్నారు : తల్లి రూపశ్రీ

8నెలల గర్భిణిగా ఉన్నప్పటినుంచే హైద్రాబాద్ సంస్థ నుంచి ఆన్‌లైన్‌లో పుట్టిన బిడ్డల సంరక్షణ, పోషణపై పేరెంటింగ్ ట్రైనింగ్ తీసుకున్నా. పుట్టిన శిశువుల్లో క్రియేటివిటీని పెంచేందుకు 3నెలల వరకు ఫ్లాష్ కార్డ్స్ అంశంలో అనంతరం తమ్మింగ్ టైమ్ (వాటర్ బెడ్‌పై బోర్ల పడుకోబెట్టి ఆడించడం) తదితర అంశాల్లో అందించిన శిక్షణ చిన్నారులు అందిపుచ్చుకోవడంతో ఈ విజయం సాధ్యపడిందన్నారు.

తహసీల్దారుకు సన్మానం

వరికుంటపాడు, అక్టోబరు 4: మండల నూతన తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన హేమంత్‌కుమార్‌ను శుక్రవారం వరికుంటపాడు పంచాయతీ పరిధిలోని టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రెవెన్యూ పరమైన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ పొద మాధవరావు, మాజీ సొసైటీ వైస్ ఛైర్మన్, ఉప సర్పంచులు ఆంద్ర శివరామిరెడ్డి, సుంకర రాధాకృష్ణ, లింగం మాలకొండయ్య, నల్లగొర్ల వెంగళరావు, షేక్ పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ఉదయగిరి రూరల్: స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం బదిలీ ఉద్యోగులను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈవోపీఆర్డీ మల్లికార్జున, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గోపి, పంచాయతీ కార్యదర్శులు గాజులపల్లి అమర్నాథ్‌రెడ్డి, శిల్ప, కార్యాలయ అటెండర్ షేక్ ఖాజాలు వేర్వేరు ప్రాంతాలకు బదిలీ కావడంతో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరాజు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జీ ఓబులరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖాధికారి బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, అక్టోబరు 4: ఉదయగిరి అటవీ శాఖాధికారిగా శుక్రవారం బీఎస్ కుమారరాజా బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది, ప్రజల సహకారంతో అడవుల సంరక్షణకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. అలాగే స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా షాజియా, ఆర్ఐగా సురేంద్రలు బాధ్యతలు స్వీకరించారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

సీపీఎం నేతల ఆందోళన



కావలి టౌన్: ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

కావలి టౌన్, అక్టోబరు 4: ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం శ్రేణులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చాలా మందికి ఇప్పటికీ ఇసుక లభించక ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే భవన నిర్మాణ కార్మికులతో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నేతలు మధుసూదన్‌రావు, తిరుపాలు, కృష్ణయ్య, మేడ వెంకశ్వర్లు, శ్రీను, వి బాబురావు పాల్గొన్నారు.

●**కందుకూరు:** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీమేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సీపీఎం నాయకులు శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కందుకూరు డివిజన్ కమిటీ నాయకులు జీ. వెంకటేశ్వర్లు, ఎస్ఏ గౌస్ మాట్లాడారు. ఉచిత ఇసుక విధానం ఇప్పటికీ అమలు కావడం లేదని మండిపడ్డారు. ట్రక్కు ఇసుక రూ.4వేలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోయారు. ఈ సమస్యతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. అనంతరం సబ్ కలెక్టరు శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీవీబీ కుమార్, టి. వెంకటరావు, ఎస్కే మల్లిక, ఎం. పద్మ, దామా కృష్ణయ్య, నాగేశ్వరరావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

●**ఆత్మకూరు:** రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తెచ్చినా ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండడం లేదని శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు పలువురు భవన నిర్మాణ కార్మికులు, సీపీఎం అనుబంధ విభాగాల కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, సీఐటీయు నాయకుడు ఆత్మకూరు నాగయ్య మాట్లాడుతూ ఇసుకను ఉచితంగా ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈమేరకు వారు ఇన్ చార్జ్ ఆర్డీవో ప్రేమసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేంద్ర, వాగాల శ్రీహరి, ఆవాజ్ రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి పి యస్దానీబాషా, ఆటో యూనియన్ నాయకుడు దశయ్య తదితరులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** స్థానిక బస్టాం డ్ సెంటర్‌లో శుక్రవారం భవన నిర్మా ణ కార్మికులు ఇసుక కొరత తీర్చాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని తహసీల్దారు వీరవసంతరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాషా, మీరామొహిద్దీన్, వెంకటేష్, బెజవాడ రంతుల్లా, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

శ్రీవారికి పెద్ద శేష వాహనసేవ


పెద్దశేషన వాహనంపై దేవేరులతో కలిసి శ్రీవారి వైభోగం

కావలి టౌన్, అక్టోబరు 4: స్థానిక బృందావనం కాలనీ శ్రీవెంకటేశ్వరస్వామికి శుక్రవారం పెద్ద శేష వాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్‌మాల్యాద్రి పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. సాయంత్రం పెద్ద శేష వాహన గ్రామోత్సవంలో చిన్నారులు, మహిళల కోలాటాలతో ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

అంకమ్మకు స్వర్ణాభరణాలు


ఆలయ అధికారులకు ఆభరణాలను ఇస్తున్న కమిటీసభ్యులు

కందుకూరు, అక్టోబరు 4: గ్రామదేవత అంకమ్మకు ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు రూ.35లక్షలతో సమకూర్చిన ఆభరణాలను శుక్రవారం ఆలయ ఈఓ కృష్ణవేణికి అప్పగించారు. అందులో బంగారు తాపడంతో రూపొందించిన స్వర్ణ కిరీటం, స్వర్ణ మకర తోరణం, స్వర్ణ పద్మపీఠంలు ఉన్నాయి. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు తల్లపనేని వెంకటేశ్వర్లు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, మంచిరాజు మురళీమోహన్, గాండ్ల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాలో 13 మందికి ఉద్యోగాలు

ఆత్మకూరు, అక్టోబరు 4: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో అమర్‌రాజ బ్యాటరీస్, గోల్డ్‌ఫీల్డ్స్, టీవీఎస్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 47 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరుకాగా 13 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసరు అబుదల్ ఖయాం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జొన్న సాగుపై రైతులకు శిక్షణ

మర్రిపాడు, అక్టోబరు 4: కంపసముద్రంలో శుక్రవారం ఇఫ్కో ఆధ్వర్యంలో జొన్న సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల తెల్లజొన్న 5వ రకం, పొట్టిజొన్న 5వ రకం సాగుచేస్తే ఎకరాకు 18-20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టరు జి శివనారాయణరెడ్డి, కృషి విజ్ఞాన శాస్త్ర వేత్త కె కిరణ్‌కుమార్, మండలం వ్యవసాయాధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

వంటగది నిర్మాణానికి రూ. లక్ష విరాళం

అనంతసాగరం, అక్టోబరు 4: స్థానిక టీజేఎన్ ఉన్నత పాఠశాలలో వంటశాల నిర్మాణానికి పూర్వ విద్యార్థి బ్రెడ్డి వెంకటకిష్టారెడ్డి లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం చెక్కును హెచ్ఎం లక్ష్మీప్రసన్నకు అందించారు.

50 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, అక్టోబరు 4: పెద్దపవని బస్టాండ్ సమీపంలో 50మద్యం బాటిళ్లతో ఆటోకోసం ఎదురుచూస్తున్న జంపాని వెంకటేశ్వర్లును శుక్రవారం 1వ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని బాలక్రిష్టారెడ్డి నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు మద్యం దుకాణాల నుంచి వీటిని స్వీకరించి బెల్టు దుకాణంలో అమ్ముకునేందుకు తీసుకువెళుతున్నట్లు చెప్పారు. ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోతుల దాడిలో మహిళకి గాయాలు

సీతారామపురం, అక్టోబరు 4:కోతుల దాడిలో మహిళకు గాయాలైన సంఘటన శుక్రవారం సీతారామపురంలోని తోటవీధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు తోట లక్షుమ్మ ఇంటి బయట కూర్చుని ఉండగా అటువచ్చిన కోతుల గుంపు ఆమెపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో ఆమెను పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

వరికుంటపాడులో వర్షం

వరికుంటపాడు, అక్టోబరు 4: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఉపసమనం పొందారు. ఈవర్షంతో ఉద్యాన, మెట్ట పంటలు సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కందుకూరు, అక్టోబరు 4: స్థానిక గాయత్రీ విద్యా సంస్థల ఆధ్వర్యంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాలల ఛైర్మన్ సీహెచ్ రామకృష్ణారావు, డైరక్టర్ సీహెచ్ భరద్వాజ్, గీతాశ్రీనివాస్, సీహెచ్ ఉషాచంద్రిక, పాతూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెరువు భూముల్లో సాగుచేస్తే చర్యలు

అల్లూరు, అక్టోబరు 4: స్థానిక చెరువు భూములను సాగు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దారు లక్ష్మీ నారాయణ హెచ్చరించారు. శుక్రవారం ఆయన చెరువు భూములను పరిశీలించారు. గతంలో నార్తుఆములూరు వద్ద భూములకు కేటాయించినట్లు మరలా ఈ భూముల్లో సాగు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సుధీర్, వీర్వో రంతుల్లా సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 4: మండలంలోని గుడినరవ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం నుంచి మంగళవారం వరకు పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. తొలిరోజు గణపతి పూజ, యాగశాలలు, కలశస్థాపన, ఆదివారం అమ్మవారి విగ్రహానికి అభిషేకం గ్రామోత్సవం, సోమవారం నూతన విగ్రహాల ప్రతిష్ఠ, మంగళవారం పొంగళ్ల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశామన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

నేడు కావలిలో తాగునీటి సరఫరా బంద్

కావలి, అక్టోబరు 4: పట్టణానికి నీటిని సరఫరా చేసే ఎస్ఎస్ ట్యాంకు వద్ద పంపు చెడిపోవడంతో శనివారం పట్టణంలో కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లాటర్‌హౌస్, వివేకానంద పార్కు పరిధిలోని ఇస్లాంపేట, గాయిత్రీనగర్, పాతూరు, పుల్లారెడ్డినగర్, మద్దూరుపాడు, కోఆపరేటివ్ కాలనీ టిడ్కోగృహాల సముదాయం ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. యుద్ధప్రాతిపదికన పంపు మరమ్మతులు చేపట్టి నీటిని సరఫరా చేస్తామన్నారు.

నేడు ఉత్తర కాలువకు గంగా హారతులు

కలిగిరి, అక్టోబరు 4: జిర్రావారిపాలెం సమీపంలోని ఉత్తర కాలువకు సోమశిల జలాశయం నుండి నీరు విడుదల చేసిన సందర్భంగా శనివారం గంగా హారతి నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్టారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరవుతున్న దృష్ట్యా మండల రైతులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్


వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, అక్టోబరు 4: రాజకీయాలకు అతీతంగా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. శుక్రవారం సాయిపేట పంచాయతీలో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్‌లో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. సుమారు 30వినతులు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు అందజేశారు. గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్, పీహెచ్‌సీ, సాయిపేట మజరా గ్రామాలు మక్కెనవారిపాలెం, వెల్లటూరివారి పాలెం, ఇస్కపాలెంలను కలిపే రోడ్డు అభివృద్ధి చేయడం చేయాలని ప్రజలు కోరారు. చెరువుకు నీరు చేరే కాలువ బాగుచేస్తేనే వర్షపు నీరు వచ్చి చేరిందని గ్రామస్థులు సూచించారు. ఉపాధి పనులు చేపట్టేలా అధికారులతో చర్చిస్తామన్నారు. అభివృద్ధికి నాయకులు, ప్రజలు కలసికట్టుగా రావాలని కోరారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ప్రవీణ, కన్వీనర్ ఎం.ఓంకారం, నేతలు గంటా లక్ష్మీనరసింహులు, గుడవళ్లూరు సొసైటీమాజీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరారవు, వల్లూరు వెంకటేశ్వర్లు, కొమ్మి ప్రభాకర్, కుంకు రాజా, ఓరుగంటి సుమన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు బ్యాక్ ఫీడింగ్‌ను పునరుద్ధరించండి

● విద్యుత్ వినియోగదారుల వినతి


వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న అదాలత్ సభ్యులు

కలువాయి, అక్టోబరు 4: మండల కేంద్రమైన కలువాయి విద్యుత్ సబ్‌స్టేషనుకు గతంలో ఉన్న ఆత్మకూరు బ్యాక్ ఫీడింగ్‌ను పునరుద్ధరించాలని పలువురు వినియోగదారులు కోరారు. శుక్రవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఛైర్‌పర్సన్ వి శ్రీనివాస ఆంజనేయ మూర్తి (రిటైర్డ్ జడ్జి), సభ్యులు కె రామమోహన్‌రావు, యస్ఎల్ అంజనీకుమార్, జీ ఈశ్వరమ్మ పాల్గొని వినియోగదారుల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కలువాయికి గతంలో ఆత్మకూరు నుంచి విద్యుత్ బ్యాక్ ఫీడింగ్ ఉండగా మూడేళ్ల క్రితం వచ్చిన వర్షాలకు పెన్నానదిలో ఉన్న టవర్ దెబ్బతిని సరఫరా ఆగిపోయింది. అప్పటి నుంచి దీన్ని పునరుద్ధరించలేదు. దీంతో ప్రస్తుతం ఆదూరుపల్లి నుంచి మాత్రమే కలువాయి సబ్‌స్టేషన్‌కు సరఫరా ఉంది. ఎప్పుడైనా ఈదురుగాలులకు ఈ లైన్ దెబ్బతింటే దానికి మరమ్మతులు చేసేంత వరకు రోజుల తరబడి కలువాయికి విద్యుత్ సరఫరా ఉండటం లేదని, ఆత్మకూరు బ్యాక్‌ఫీడింగ్ పునరుద్ధరించాలని వినియోగదారులు కోరారు. అలాగే కలువాయి విద్యుత్ సబ్‌స్టేసన్‌కు గత కొంతకాలంగా ఏఈ లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, మండలాన్ని నెల్లూరు రూరల్ డివిజన్, పొదలకూరు సబ్ డివిజన్‌లో ఉంచాలని, దాచూరుకు గతంలో మంజూరైన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టాలని, కలువాయిలో ఇళ్లపై ఉన్న 33కేవీ, 11కేవీ విద్యుత్ లైన్లు మార్చాలని, చింతలాత్మకూరు, చీపినాపి, పర్లకొండ, తిరుమలపాడు గ్రామాలకు జూనియర్ లైన్‌మెన్‌ను నియమించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

సీటుబెల్టు తప్పనిసరిగా ధరించాలి

● ఆర్టీసీ డ్రైవర్లకు ఈడీ సూచన


గ్యారేజీ తనిఖీ చేస్తున్న ఈడీ

ఉదయగిరి రూరల్, అక్టోబరు 4: ఆర్టీసీ డ్రైవర్లు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని నెల్లూరు జోన్-3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఉదయగిరి ఆర్టీసీ డిపోను సందర్శించి అన్ని విభాగాలను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలన్నారు. సీటుబెల్టు ధరించడం ద్వారా ప్రమాదం సంభవిస్తే చిన్న గాయాలతో బయటపడవచ్చన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఉదయగిరి డిపో నిర్వహణ బాగుందన్నారు. ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా ఉద్యోగులు, కార్మికులు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా డిపో పరిధిలో అత్యధిక కేఎంపీఎల్, రాబడి సాధించిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బందికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి కార్మికుడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ మురళిబాబు, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ నాగభూషణం, గ్యారేజీ ఇన్‌చార్జి నాగరత్నం, సూపరిటెండెంట్ నారాయణరావు, ఏడీసీ ఎం.వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 4: పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, సినిమాహాలు సెంటర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం వైద్యఆరోగ్య సిబ్బంది చేపడుతున్న ఇంటింటా లార్వా, జ్వరపీడితుల గుర్తింపు సర్వేను గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకల్పన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా జ్వరాలు ప్రబలే అస్కారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది ప్రతిరోజు గృహాలను సందర్శించాలన్నారు. అనంతరం వైద్యశిబిరాన్ని తనిఖీచేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ వెంకటసుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి

సీతారామపురం, అక్టోబరు 4 : సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో భాస్కర్ సూచించారు. మండల పరిధిలోని బసినేనిపల్లి సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీవో భాస్కర్ ఆకస్మికంగా తనిఖీచేసి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. రికార్డులను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, గోపి, సచివాలయాల సిబ్బంది హాజరయ్యారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించడం తగదు


నిరసన వ్యక్తం చేస్తున్న ఏవీఎస్ నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 4 : దసరా సెలవుల్లో విద్యాసంస్థల నిర్వాహకులు తరగతులు నిర్వహించవద్దని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా పలు ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు తరగతులు కొనసాగిస్తుండడం తగదని ఆంధ్రా విద్యార్థి సంఘం (ఏవీఎస్) నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహంతరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ వద్దకు ఏవీఎస్ నాయకులు వెళ్లి తరగతులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇకనైనా మండల విద్యాశాఖాధికారులు స్పందించి తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవీఎస్ నాయకులు శ్రీరామ్‌రెడ్డి, అరుణ్, పూర్ణేష్, తిరుమలేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.




ఇరగాళమ్మ గుడిలో సామూహిక కుంకుమార్చన, మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరి అమ్మవారి ప్రాకారోత్సవం

అంబా శాంభవి!

కనువిందు చేస్తున్న దేవీ అలంకారాలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 4 : నగరంలోని ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం కావడంతో రెండోరోజు ఆలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి.

● రాజరాజేశ్వరి అమ్మవారు భవానీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. లలితా కుంకుమార్చన, మహాన్యాస పూజలు, సంపుటీకరణ చండీహోమాలు జరిగాయి. ఉభయకర్త లుగా మాగుంట సోదరులు, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సరిత, తోట దామోదర్, శోభారాణి వ్యవహరించారు. ● ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామపురంలోని మహాలక్ష్మి అమ్మవారికి భవానీ అలంకరణ జరిగింది. సామూహిక కుంకుమ పూజ, విశేష నవావరణం జరిగాయి. మధ్యా హ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ● వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రీ అలంకారం భక్తులను ఆకట్టుకుంది. ● నవాబుపేట శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీ అమ్మవారికి గాయత్రి అలంకారంలో పల్లకీ సేవ జరిగింది. ● సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయం, ఉమాదేవి ఆలయాల్లో రాజరాజేశ్వరి అలంకారం, చండీ హోమం జరిగాయి. గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞాన బోధ సభ కమిటీ పర్యవేక్షించింది. ● మూలాపేట శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి ఆలయంలో శుక్రవారం నవరాత్రి ఉత్సవాల్లో ద్రౌపదీదేవికి మహాలక్ష్మీ అలంకారం జరిగింది. ఉభయకర్తలు, ఆలయ ఈవోలు పర్యవేక్షించారు. ● బాలాజీనగర్ సీతారామ మందిరంలో సీతాదేవికి, అయ్యప్పగుడి శ్రీగురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో, మహాలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలు జరిగాయి. ● మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో వైభవలక్ష్మీ అమ్మవారికి సౌభాగ్యలక్ష్మీ అలంకరణ జరిగింది. ● తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో రంగనాయకమ్మకి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉదయం తిరుమంజన సేవలు, రాత్రి ప్రాకారోత్సవం జరిగాయి. ● గ్రామదేవత ఇరగాళమ్మ గుడిలో సామూహిక కుంకుమార్చన జరిగింది. ● మా గుంట లే అవుట్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీనారాయణ స్వామికి తిరుమంజనం, విశేష పూజలు, హోమాలు జరిగాయి.

త్రిపురాంబికాదేవిగా కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 4: జొన్నవాడ ఆలయంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం త్రిపురాంబికాదేవి అలంకారములో కామాక్షితాయి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి నవావరణ పూజలు నిర్వహించారు. రాత్రి కాళరాత్రి మహా నవావరణ పూజలు నిర్వహించారు. సింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్దూరులోని కోదండరామస్వామి ఆలయంలో స్వామి వారు మహా విష్ణువు అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు.

మనుబోలు : దేవీ నవరాత్రుల సందర్భంగా మనుబోలు గ్రామ దేవత మనుబోలమ్మ, నాగార్పమ్మ, గంగమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. ముగ్గురమ్మలకు క్షీర, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజను అర్చకులు సర్వేపల్లి ఫణీంద్రశర్మ, మల్లాది సుబ్రహ్మణ్యశర్మ వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయదాతలుగా ముంగర రవీంద్రరెడ్డి, లలితమ్మ దంపతులు వ్యవహరించారు. అనంతరం పొంగళ్లు పొంగించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

రాపూరు: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పెంచలకోన క్షేత్రంలో శుక్రవారం ఉదయం మూలమూర్తి అమ్మవారికి వస్త్ర సమర్పణ, పుష్పాలంకరణ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం మూలమూర్తి అమ్మవారికి పూలంగిసేవ, సామూహిక కుంకుమార్చన, ఆదిలక్ష్మీ అలంకారం వైభవంగా నిర్వహించారు. భక్తులకు క్యూలైన్ల ఏర్పాట్లు, మంచి నీరు సరఫరా, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి తెలిపారు.



మనుబోలు : ప్రత్యేక అలంకరణలో మనుబోలమ్మ అమ్మవారు

సీఐడీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (క్రైం), అక్టోబరు 4: సీఐడీ ఇన్‌స్పెక్టర్లుగా మధుబాబు, రాజేష్ శుక్రవారం దర్గామిట్టలోని సీఐడీ కార్యాల యంలో బాధ్యతలు స్వీక రించారు. మధుబాబు గతంలో నెల్లూరు సౌత్‌ట్రాఫిక్, చిన్నబజారు, ఎస్‌బీ ఇన్‌సెక్టర్‌గా, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సూళ్లూరుపేట ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. రాజేష్ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేశారు.

నేత్రదానం

నెల్లూరు రూరల్, అక్టోబరు 4 : వెంకటేశ్వరపురానికి చెందిన బోగాల సుబ్బమ్మ (79) అనారోగ్యంతో మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మెడరన్ ఐ ఆసుపత్రి నిపుణులు కనుగుడ్లను సేకరించారు.

అంగన్‌వాడీ భవనం పరిశీలన

నెల్లూరు రూరల్, అక్టోబరు 4 : నెల్లూరు రూరల్లోని చింతారెడ్డిపాళెం వద్ద నిర్మిస్తున్న అంగన్ వాడీ భవనాన్ని ఐసీడీ ఎస్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. పీడీ హేనసుజన్, సీడీపీవో కే లక్ష్మీ దేవి భవన నిర్మాణాన్ని పరిశీలించి, పనులు త్వర తిగతిన పూర్తి చేయాలని నిర్మాణ దారుడిని కోరారు. జడ్పీ నిధులు రూ.16 లక్షలతో ఈ నిర్మాణం జరుగు తోందని, త్వరగా పూర్తయితే పిల్లలు, బాలింతలు, గర్భవతులకు ఉపయోగపడుతుందని చెప్పారు.

పార్టీలోకి వచ్చేవారికి గౌరవం : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, అక్టోబరు 4 : తమను నమ్ముకుని టీడీపీలోకి వస్తున్న వారిని తగిన గౌరవంతో చూసుకుంటామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పార్టీ కార్యకర్తలు, వారి ప్రయోజనాల కోసం 24 గంటలు అందు బాటులో ఉంటామని అన్నారు. శుక్రవారం రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తనతోపాటు తన సోదరుడు గిరిధర్‌రెడ్డి నిత్యం కార్యకర్తల అవసరాల కోసం వేచి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, సారంగం గున్నయ్య, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ప్రదీప్, కేశవులు, వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.



ఎంపీపీని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

తెలంగాణ మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మ దహనం

నెల్లూరు (సాంస్కృతికం) : మహిళలపైనా, నటుడు నాగార్జున కుటుంబం పైనా అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలం గాణ మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను శుక్రవారం నగరంలో దహనం చేశారు. న్యూటాకీస్ సెంటర్‌లో అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, అక్కినేని అభిమానులు సురేఖ బొమ్మను దహనం చేశారు. మంత్రి వర్గం నుంచి ఆమెను డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రికి ఫ్యాక్స్ మెసేజ్‌లు పంపినట్లు అక్కినేని అభిమానులు తెలిపారు.



కొండా సురేఖ దిష్టిబొమ్మను దహనం చేసిన అక్కినేని నాగార్జున ఫ్యాన్స్

వరద బాధితులకు రూ.50వేల విరాళం

వెంకటాచలం, అక్టోబరు 4 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం వెంకటాచలంలోని పద్మావతి హోటల్ అధినేత, టీడీపీ సీనియర్ నేత కుడితిపూడి మురళీధర్ నాయుడు రూ.50 వేలు విరా ళం ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఆయన కలిసి చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మురళీధర్‌నాయుడు సోదరులు వెంకటేష్‌నాయుడు, అశోక్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సోమిరెడ్డికి చెక్కు అందజేస్తున్న కుడితిపూడి మురళీధర్‌నాయుడు

నేడు వరిగొండకు ఎమ్మెల్యే రాక

తోటపల్లిగూడూరు, అక్టోబరు 4 : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఉదయం 8 గంటలకు మండలంలోని వరిగొండలో పర్యటిస్తారని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పర్యటనకు సచివాలయ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

విడవలూరు ఎమ్పీడీవోగా నగేష్‌కుమారి

విడవలూరు, అక్టో బరు 4 : విడవలూరు ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నగేష్‌కుమారిని గురువారం టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డిలు కలిసి ఘనం గా సన్మానించారు. ఈ సం దర్భంగా ప్రభుత్వం అంద జేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా సమన్వయం చేసుకుని అందరికీ ఇవ్వాలని కోరారు.



● **మనుబోలు :** ఎంపీడీవోగా జలజాక్షి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధా రణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా జరుగుమల్లి ఎంపీడీవోగా ఉన్న ఆమెను మనుబోలుకు నియమించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లును దగదర్తి మండలానికి బదిలీ చేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయ ఏవోగా వెంకటాచలం ఏవో ముజిబున్నీసా మనుబోలుకు రాగా, మనుబోలు ఏవో రవికుమార్‌రెడ్డి జడ్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కొత్తగా వచ్చిన అధికారులు సిబ్బందిని పరిచయం చేసుకుని మండల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు.



మనుబోలు ఎంపీడీవో జలజాక్షి

● **తోటపల్లిగూడూరు :** ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో ఆయన గూడూరు నుంచి మండలా నికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను అందరి సమన్వయ సహకారంతో అమలు చేస్తామన్నారు. బాధ్యతలు చేప ట్టిన ఆయనను సిబ్బంది అభినందించారు.

● **మండల సర్వేయర్‌గా..**

మండల సర్వేయర్‌గా షేక్.మహబూబ్‌బాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల డిప్యూటీ తహసీల్దారు శివయ్య, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఆయనను అభినందనలు తెలిపారు. మహబూబ్ బాషా మాట్లాడుతూ భూసర్వే విషయంలో రైతాంగానికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.

దుర్గా ఆలయంలో ఎమ్మెల్యే ప్రశాంతి



దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 4: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని రాఘవరెడ్డి కాలనీలో దుర్గాదేవి ఆలయంలో జరుగుతున్న దుర్గాదేవి ఆల య కుంభాభిషేకం కార్యక్రమాల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాజీ ఎంపీటీసీ బాలాకుమార్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం దుర్గానగర్‌లో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పుట్టా ధనలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు రంగనాథం, చెంబేటి ప్రసాద్, చెంగల్‌రాయుడు, గోపిలతో కలిసి దుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకి అమ్మవారి చీర, సారె అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. టీడీపీ నాయకులు ఎంవీ.శేషయ్య, హరికృష్ణ, రామానాయుడు, ఉసుపురుపాటి, వల్లూరు శ్రీనివాసులు, సైరా, కోదండరామిరెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

ఇసుక కొరతతో ఇబ్బందులు: సీపీఎం ధర్నా

నెల్లూరు (రూరల్/వైద్యం), అక్టోబరు 4 : ఇసుక అందక అనేక మంది భవన నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకులు ఆందోళనకు దిగారు. శుక్రవారం నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచితంగా ఇసుకను అందచేస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు ఆ ఊసేలేదని విమర్శించారు. దీంతో ఇల్లు కట్టుకోవాల్సిన అనేక మంది నిర్మాణాలు ఆపేసుకున్నారని తెలిపారు. ఇసుక తోలకాలతో ఉపాధి పొందుతున్న కూలీలకు పనిలేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్దన్, వెంకయ్య, అనిల్, నాగరాజు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతి పత్రం అందచేశారు.

వెంటనే విడుదల చేయాలి

ఇసుకను వెంటనే విడుదల చేయాలంటూ సీపీఎం నాయకులు శుక్రవారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బుజబుజ నెల్లూరు నుంచి తల్పగిరి కాలనీలో ఉన్న మైనింగ్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి మైనింగ్ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. పార్టీ నేత మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండా ప్రసాద్, బత్తల కిష్టయ్య, అజీజ్, దేవతాటి సంపత్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరా చేయాలి

కోవూరు: గృహ నిర్మాణాలకు ఇసు కను ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహ సీల్దారు నిర్మలానంద బాబాకు వినతిపత్రం సమర్పిం చారు. ఆందోళనలో సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, సుబ్బారావు, పెద్దన్న, బుజ్జయ్య, హరి, అఫ్రోజ్, రమేష్, అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు



మైనింగ్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వెంకటాచలం : ఇసుకను వెంటనే విడుదల చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఇప్పటికే భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఓడూరు వెంకటకృష్ణయ్య, షేక్.నజీర్, సుధాకర్, సుబ్బరామయ్య, వెంకయ్య, కృష్ణ, మస్తాన్ పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : పేదలకు కేవలం రవాణా ఖర్చులతో ఉచితంగా ఇసుక అందజేయాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ అధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల గుర్నాథం, సీహెచ్ మల్లికార్జున పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : ఉచిత ఇసుక కోసం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలో చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా, సీపీఎం నాయకులు కాల్తిరెడ్డి రవణమ్మ, బండి శౌరీ, ఈపూరు లక్ష్మయ్య, రాధయ్య, భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చి : తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

నెల్లూరు ఆర్డీవోగా అనూష

నెల్లూరు (వెంకటేశ్వర పురం), అక్టోబరు 4 : నెల్లూరు ఆర్డీవోగా నాగ సంతోష్ అనూష శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఆర్డీవో మలోలను జీఏడీకి రిపోర్టు చేయవలసిందిగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో నూతన ఆర్డీవోగా నాగ సంతోష్ అనూషను నియమించింది. ఆమె ప్రస్తుతం విశాఖపట్నంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల జరిపిన బదిలీల్లో నెల్లూరు ఆర్డీవోగా మొదటి పోస్టింగ్ ఇచ్చింది.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

కోవూరు, అక్టోబరు 4: స్థానిక స్త్రీశిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో శనివారం విధాన్ సే సమాధాన న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ విజ్ఞాన సదస్సులో మహిళలు, స్వచ్ఛంద సేవాసంస్థల కార్యకర్తలు పాల్గొనాలని పేర్కొన్నారు.

'తనిష్క్' పునఃప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 4 : టాటా గ్రూప్‌నకు చెందిన జ్యూవెలరీ షోరూమ్ తనిష్క్ నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డులో మెగా షోరూమ్‌గా శుక్రవారం పునః ప్రారంభ మైంది. టైటాన్ కంపెనీ జ్యూవెలరీ డివిజన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శరద్ ఆర్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్‌బీఎం వాసుదేవరావు, ఏబీఎం పూర్ణచంద్రరావు, స్టోర్ మేనేజర్ రాంబాబు, పాల్గొన్నారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఈ షోరూమ్‌లో కొన్న ప్రతీ ఆభరణంపైనా గోల్డు కాయిన్‌ని ఉచితంగా ఇస్తున్నారు.

జీవో నెం.42 రద్దు చేయాలి

● మంత్రి నారాయణకు అధ్యాపకుల వినతి



మంత్రి నారాయణను సత్కరిస్తున్న అధ్యాపకులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 3 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల ఉద్యోగోన్నతికి సమస్యగా మారిన జీవో నెంబరు 42ను రద్దు చేయాలని జిల్లా ప్రభుత్వ కళాశాలల టీచర్స్ అసోసియేషన్(జీసీటీఏ) నాయకులు కోరారు. వారు శుక్రవారం రాష్ట్ర మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఎయిడెడ్ కళాశాలల సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఇచ్చిన జీవో కారణంగా రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని అధ్యాపకులు సీనియారిటీ కలిగి ఉన్నప్పటికీ ప్రిన్సిపాళ్లుగా ఉద్యోగోన్నతి పొందలేకపోతున్నారన్నారు. లోకల్ కేడర్ కలిగిన ఎయిడెడ్ సిబ్బందిని, జోనల్ కేడర్ కలిగిన ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులతో కలిపే విధంగా ఉన్న ఆ జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వీ శ్రీరామమూర్తి, కార్యదర్శి డాక్టర్ ఎం వెంకట్రావ, జీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరసింహులు, జిల్లా కార్యదర్శి రాంప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

నెల్లూరు(హరనాథపురం): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అన్నక్యాంటీన్ల నిర్వహణకు భారత్ సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం రూ. 5వేల విరాళాన్ని అందించారు. ఈ మేరకు చెక్కును గురువారం నెల్లూరులో మంత్రి పొంగూరు నారాయణకు అందజేశారు. ఖాసీం గత నెలలో కూడా అన్న క్యాంటీన్‌కు రూ.5వేలిచ్చారు. కాగా, ఆగిపోయిన గుర్రం జాషువా గ్రంథాలయ నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ఈ సందర్భంగా మంత్రిని ఖాసీం కోరారు.

నారాయణతో నరసరావుపేట ఎమ్మెల్యే భేటీ

నెల్లూరు (వైద్యం): మంత్రి పొంగూరు నారాయణను నరసారావుపేట ఎమ్మెల్యే అరవింద్‌బాబు శుక్రవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో కలిశారు. ఇరువురు పలు విషయాలపై చర్చించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 'వీబీఆర్' విద్యార్థులు

ముత్తుకూరు, అక్టోబరు 4 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ముత్తుకూరులోని వీబీఆర్ ఇంగ్లీష మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. తమ స్కూల్ నుంచి రాష్ట్రస్థాయిలో జరిగే సెపక్‌తక్రా కరాటే, ఎయిర్‌గన్ షూటింగ్ పోటీలకు 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ శుక్రవారం తెలిపారు. నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్‌తోపాటు ఏవో రాములు అభినందించారు.

రాపూరు చెరువులకు కండలేరు నీరివ్వాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 4: రాపూరు మండలంలోని చెరువులకు ఎత్తిపోతల పథకం ద్వారా కండలేరు జలాలను అందించాలని తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్‌ఈకి శుక్రవారం బీజేపీ సమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ వినతి పత్రం ఇచ్చారు. కండలేరు జలాశయం రాపూరు మండలంలోనే ఉన్నప్పటికీ పలుగ్రామాలకు సాగునీటి సౌకర్యం లేదన్నారు. వెలుగోను పెద్దచెరువు, శెట్టిగుంట చెరువు, కొండ చెరువు, సైదాబాద్పల్లి చెరువు, బొజ్జలపల్లి చెరువుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పారించాలని కోరారు.

జాబ్‌మేళాలో 35 మందికి ఉద్యోగ అవకాశాలు

వెంకటాచలం, అక్టోబరు 4 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్శిటీలో శుక్రవారం రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్త సహకారంతో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ అర్హత గల 44 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. వివిధ ప్రసి ద్ధి గాంచిన కంపెనీలు, సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 35 మందిని ఎంపిక చేశారు. వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున ఇలాంటి జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ మేరీ సందీప్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూం, సిడాప్ జేడీఎం హేమావతి, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ సాయిహేమంత్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

పొదలకూరు, అక్టోబరు 4: పొదలకూరు గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తూ ఇందుకూరుపేటకు బదిలీ అయిన దర్శి దుర్గాదొరబాబును ఘనంగా సన్మానించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో పంచాయతీ సర్పంచు మల్లికా చిట్టెమ్మ, ఉపసర్పంచు వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామ నాయకులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం కార్యదర్శి దుర్గా దొరబాబు చేతుల మీదుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రెండు జతల ఖాకీ చొక్కాలు అందజేశారు.

డిసెంబరుకల్లా డయాలసిస్ సెంటర్ ఏర్పాటు

పొదలకూరు, అక్టోబరు 4 : పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ ఏడాది డిసెంబరు కల్లా డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు బయోమెడికల్ ఇంజనీర్ (స్టేట్ మోడల్ ఆఫీసర్ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్) సందీప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. డయాలసిస్ సెంటర్‌ను ఏ భవనంలో ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందోనని సీహెచ్‌సీలోని భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం కో లొకేటెడ్ పీహెచ్‌సీ డాక్టర్ల భవనంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఆ తర్వాత వీలును బట్టి శాశ్వత భవనంలోకి మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

9న విజయవాడకు తరలిరండి


కోవూరు: జాతీయస్థాయిలో కులగణన చేపట్టాలని కోరుతూ ఈనెల 9న విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకీప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల గణన అనంతరం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు, నామినేటెడ్ పోస్టుల్లో కూడా రిజర్వేషన్ వసతి కల్పించాలన్నారు. అనంతరం బీఎస్పీ నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడింపాటి అనిల్, ఉపాధ్యక్షుడిగా ముదివర్తి కృష్ణమూర్తి, ప్రధానకార్యదర్శిగా చాట్ల వేణు, కార్యదర్శిగా గరికిపాటి చంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు కాకుటూరు పుష్పాంజలి, జిల్లా ఇన్‌చార్జి శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 5 అక్టోబరు 2024

- ధ్వజారోహణంతో మొదలైన సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- శ్రీవారికి సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణ
- పెద్దశేషుడిపై మాడవీధుల్లో స్వామి విహారం
- కళాబృందాల ఆటపాటలతో అంబరాన్నంటిన సంబరాలు

ఆరంభం ఆదిదేవుని మహోత్సవం

బంగారు ధ్వజస్తంభం మీద గరుడపతాకం రెపరెపలాడింది. ముక్కోటి దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ గరుడుడు ప్రకటన చేశాడు. మంగళవాయిద్యాల నడుమ, వేదగానాల మధ్య శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణం వైభవంగా సాగింది. ఆ తర్వాత ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీసమేతంగా సంప్రదాయబద్ధంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పెద్దశేష వాహనసేవలో పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచీ వచ్చిన 14 బృందాలు మాడవీధుల్లో ప్రదర్శించిన కళావిన్యాసాలు భక్తులను మురిపించాయి.









తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన శుక్రవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పెద్దశేషవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఏడుతలల స్వర్ణశేషవాహనంపై పరమపద వైకుంఠనాథుడి అలంకారంలో మాడవీధుల్లో ఊరేగారు. శ్రీవారికి ఆదిశేషుడు మిక్కిలి సన్నిహితుడు. స్వామి కొలువుదీరింది శేషాద్రి కావటంతో పాటు పానుపు కూడా శేషుడే. ఆదిశేషుడు తన పడగనీడలో స్వామివారిని సేవించిన వ్యక్తి. రామావతారంలో లక్ష్మణుడిగా, ద్వాపరంలో బలరాముడిగా శ్రీమన్నారాయణుడికి శేషుడు మిక్కిలి సన్నిహితంగా ఉన్నట్లు పురాణోక్తి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల మొదటిరోజు శేషుడికి ప్రాధాన్యమిస్తూ పెద్దశేష వాహనంపై ఊరేగటం ఆనవాయితీ. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఉత్సవర్లను వజ్ర, వైడూర్య, మరకత, మాణిక్య, పట్టుపీతాంబర వస్త్ర, సుగంధ పరిమళ పుష్పమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి 9 గంటలకు మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, కళబృందాల ప్రదర్శనలు, గోవిందనామస్మరణల నడుమ పెద్దశేషవాహనంపై శ్రీనివాసుడు దర్శనమిచ్చాడు. అంతకుముందు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాహన మండపంలో ఉత్సవర్లను దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు హారతి ఇచ్చి శఠగోపంతో ఆశీర్వదించారు. తొలిరోజే మాడవీధులు సాంస్కృతిక కార్యక్రమాలతో మార్మోగాయి. కోలాటాలు, డప్పువాయిద్యాలు, వివిధ దేవతామూర్తుల అలంకరణలు, చెక్కభజన బృందాలు పాల్గొన్నాయి.



- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆగమోక్తంగా ధ్వజారోహణం

శ్రీవారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం 5.45 - 6 గంటల మధ్య మీనలగ్నంలో జరిగిన ధ్వజారోహణ ఘట్టంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సమక్షంలో వేదగానాలు, మంగళవాయిద్యాలు మధ్య అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజపటాన్ని ఎగురవేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈకార్యక్రమం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. ఈ కార్యక్రమంలో జీయర్‌స్వాములు, అర్చకులు, ఆగమ సలహాదారులు, ఈవో శ్యామలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు మోస్తరుగానే రద్దీ

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు భక్తుల రద్దీ ఓ మోస్తరుగానే కనిపించింది. రాత్రి జరిగిన పెద్దశేష వాహనంలో భక్తులు తక్కువగా ఉన్నారు. గ్యాలరీలోనూ పలుచగా కనిపించారు. సీఎం పర్యటన నేపథ్యంలోనే భక్తుల రద్దీ తక్కువగా ఉందని, పెరటాశి మాసం మూడో శనివారం కావడంతో శనివారం రద్దీ అధికంగా ఉండే అవకాశముందని టీటీడీ భావిస్తోంది.



వైభవంగా ధ్వజపటం ఊరేగింపు

శ్రీవారి బ్రహ్మోత్సవ ధ్వజారోహణం సందర్భంగా శుక్రవారం ధ్వజపటం ఊరేగింపు వైభవంగా జరిగింది. వైఖానస ఆగమం ప్రకారం శాస్త్రోక్తంగా గరుడకేతన ప్రతిష్ఠ, కంకణధారణ, ఆలయ ఆవరణంలో, బయట అష్టదిక్కుల్లో అర్చకులు బలిని వేస్తూ ఆలయం ముందుకు వచ్చారు. అర్చకుల వెనుకభాగంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి, అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంత, ధ్వజపటాన్ని మాడవీధుల్లో ఊరేగిస్తూ సకలదేవతామూర్తులకు ఆహ్వానం పలికారు. ఊరేగింపు అనంతరం ఉత్సవ మూర్తులతో పాటు ధ్వజపటాన్ని ఆలయంలోకి తీసుకెళ్లారు.



ధనలక్ష్మీదేవిగా అన్నపూర్ణ



తిరుపతి నగరం లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 5, 10, 20, 50, 100, 200, 500 రూపాయల నోట్లతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

- తిరుపతి అర్బన్

టీటీడీ బోర్డు లేకుండానే బ్రహ్మోత్సవాలు

- స్పెసిఫైడ్ అథారిటీ కూడా వేయలేదు
- టీటీడీ చరిత్రలో ఇటువంటి పరిస్థితి అరుదు

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి పాలకమండలి లేకుండానే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. గురువారం అంకురార్పణ, శుక్రవారం ధ్వజారోహణం కూడా జరిగాయి. కనీసం స్పెసిఫైడ్ అథారిటీ కూడా లేదు. ఇటువంటి పరిస్థితి చాలా అరుదు. పాతికేళ్లలో 2017లో మాత్రమే శ్రీవారి బ్రహ్మోత్సవాలు పాలకమండలిగానీ, స్పెసిఫైడ్ అథారిటీగానీ లేకుండానే జరిగాయి. మళ్లీ అలాంటి పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. టీటీడీ ఏర్పాటైనప్పటి నుంచీ నిర్వహణ కోసం నిర్ణీత కాలానికి ప్రభుత్వం పాలకమండళ్లను నియమిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. పాలకమండలి లేని సమయాల్లో దేవస్థానాలకు సంబంధించిన కీలక నిర్ణయాల కోసం ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం స్పెసిఫైడ్ అథారిటీని నియమిస్తుంది. పాలకమండలిలో అధ్యక్షుడు, సభ్యులు వుంటే స్పెసిఫైడ్ అథారిటీలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గానూ, ఈవో, జేఈవోలు సభ్యులుగా వుంటారు. కార్యనిర్వహణాధికారిని కూడా ప్రభుత్వమే నియమిస్తున్నప్పటికీ ఆ అధికారికి పరిమిత అధికారాలు మాత్రమే వుంటాయి. పరిపాలనాపరంగా సాధారణ నిర్ణయాలను మాత్రమే ఈవో తీసుకోగలరు. కీలక అంశాలపై పాలకమండలిలోనే చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. టీటీడీ ఏటా ఎన్నో ఉత్సవాలు, వేడుకలు నిర్వహిస్తుంటుంది.తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా వున్న అనుబంధ ఆలయాల్లో కూడా వీటిని చేపడుతుంటుంది. అయితే అవన్నీ ఒకెత్తు అయితే శ్రీవారి బ్రహ్మోత్సవాలు మరొక ఎత్తు. ఈ ఉత్సవాలకు ఉన్న ప్రాధాన్యత,ప్రాచీనత మరే ఉత్సవానికీ ఉండదు. అయినా ఈసారి పాలకమండలి లేకుండానే బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలకు ముందే టీటీడీ పాలకమండలిని ప్రకటిస్తారనే ప్రచారం జరిగింది. పలు పేర్లు కూడా ఊహాగానాల్లో తిరిగాయి. టీటీడీ చైర్మన్ పదవికి, మంత్రి పదవికి కూడా లేనంత పోటీ ఉంటుంది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు అవుతున్నా పాలకమండలిని నియమించకపోవడం మీద రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.

మానవాళికి ఉపయోగపడేలా
ఇస్రో ప్రయోగాలు

- అంతరిక్ష వారోత్సవాల ప్రారంభంలో షార్ డైరెక్టర్ రాజరాజన్



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న షార్ డైరెక్టర్ తదితరులు

సూళ్లూరుపేట, అక్టోబరు 4: మానవాళికి ఉపయోగపడే ప్రయోగాలను ఇస్రో చేపడుతోందని, సాంకేతిక జ్ఞానాన్నీ అందిస్తుందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను షార్‌లోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్ 1 వంటి భారీ ప్రయోగాల విజయంతో మరిన్ని ప్రయోగాత్మక ప్రయోగాలకు మనో ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. రాబోయే 15 సంవత్సరాల్లో ఇస్రో ఏడాదికి 25 ప్రయోగాలు చేపట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. అంతరిక్షంలో చేపట్టే ప్రయోగాలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాల గురించి విద్యార్థి దశ నుంచే తెలియజేసేందుకు ఏటా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఇస్రో నిర్వహిస్తుందన్నారు. పుదుచ్చేరి టెక్నాలజికల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.మోహన్ మాట్లాడుతూ దేశం గర్వించతగ్గ చంద్రయాన్-3 వంటి విజయాన్ని అందించిన షార్ సెంటర్‌ను సందర్శించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాల్లో బుల్లి ఉపగ్రహాలను పంపించేందుకు విద్యార్థులకు అవకాశం ఇవ్వడం మంచిదన్నారు. అనంతరం వారోత్సవాలకు సంబంధించిన వీడియోను విడుదల చేశారు. ఇస్రో చేపట్టే ప్రయోగాలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలు తదితర వాటికి సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. షార్ అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులు రెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ స్పెషలాఫీసర్ అవుట్

- జయచంద్రారెడ్డిని తొలగిస్తూ టీటీడీ నిర్ణయం
- వైసీపీ హయాంలో అర్హత లేకున్నా అందలం
- వైవీ సుబ్బారెడ్డి బంధువు కావడమే ఆయన అర్హత
- టీటీడీ సొమ్ముతో లక్షల్లో వేతనం, రాజభోగం
- పాలన మారాక ఎట్టకేలకు చర్యలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అర్హతలేకపోయినా అగ్రపీఠమేసి స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ(ఎస్‌బీఐఏ) స్పెషలాఫీసర్ డాక్టర్ ఎం.జయచంద్రా రెడ్డిపై ఎట్టకేలకు వేటు పడింది. టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు ఆయన్ను స్పెషలాఫీసర్ విధులనుంచి తప్పిస్తూ డైరెక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్రకు బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత విభాగాల నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ కూడా జయచంద్రారెడ్డి అందజేయాలని, వాహనం ఇతరత్రా సదుపాయాలన్నీ స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ కీలక నేత వైవీ సుబ్బారెడ్డికి సమీప బంధువు అయిన డాక్టర్ జయచంద్రా రెడ్డి స్విమ్స్‌లో ఎంసీహెచ్ (సర్జికల్ ఆంకాలజీ)కోర్సు ఉత్తీర్ణత చెంది వారం రోజులు తిరగకముందే ఎస్‌బీఐఏను ఏర్పాటు చేసి స్పెషలాఫీసర్‌గా నియమిస్తూ, లక్షల్లో వేతనం, కారు, క్వార్టర్స్, ఛాంబర్..ఇలా వెంటవెంటనే కేటాయించారు. నిబంధనలను గాలికొదిలేసి నియామకం చేపట్టిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈనేపథ్యంలో గత నెల 18న 'అర్హత లేకున్నా అందలం' అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై విచారణ చేపట్టిన టీటీడీ ఈవో అక్టోబరు 1న ఆయనకు నోటీసులు అందజేశారు. ఆయన దగ్గరనుంచి సరైన సమాధానం లేకపోవడంతో తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.



జయచంద్రారెడ్డి

తొలగించారు సరే విచారణ సంగతేంటి?

ఎస్‌బీఐఏ స్పెషలాఫీసరుగా నియామకమైన జయచంద్రా రెడ్డి.. మెల్లమెల్లగా స్విమ్స్‌కే స్పెషలాఫీసర్‌గా మారిపోయారు. ఆంకాలజీ అనుబంధ విభాగాలతో పాటు పాథాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాలకు సంబంధించిన పరికరాల కొనుగోలు, సిబ్బంది నియామకాలు, స్విమ్స్-టీటీడీకి లైజన్ ఆఫీసర్ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించారు. స్విమ్స్‌లో 15 మందికి పైగా సీనియర్ ప్రొఫెసర్ల నేతృత్వంలోని మెడికల్, సర్జికల్, రేడియేషన్ అంకాలజీ, రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ వంటి అనేక విభాగాలను తన అధీనంలోకి తెచ్చుకున్నారు. పలు విభాగాధిపతుల ఫైళ్లను ప్రత్యేకాధికారి ద్వారా రూట్ చేయాలని ఆదేశాలిచ్చారు. స్విమ్స్ శాఖల సాధారణ పనితీరులో జోక్యం చేసుకోవడమే కాకుండా స్విమ్స్ హైపవర్ సహా పలు కమిటీల్లో ఆయన పేరు ఉండాల్సిందే. పాత స్విమ్స్ భవనం పునరుద్ధరణ, న్యూరో అండ్ కార్డియో సైన్సెస్ బ్లాక్ నిర్మాణం, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ కోసం పరికరాలు కొనుగోలు, మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, డ్రైవర్ల నియామకంలో ఇతడి ప్రమేయం ఎక్కువగా ఉందని, తద్వారా నిధుల దారిమళ్లింపులు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా ఖరీదైన పరికాల కొనుగోలులోనూ ఆయన ప్రమేయం ఉందని, వాటిపైనా దర్యాప్తు చేయాలని పలువురు కోరుతున్నారు. జయచంద్రారెడ్డిని స్పెషలాఫీసర్‌గా తొలగించార సరే, అతని అక్రమాలపై విచారణ చేపట్టాల్సి ఉందని డిమాండు చేస్తున్నారు.

వెయ్ వెయ్.. మరో స్టెప్పు వెయ్



చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైన 'మోహన మంత్ర' కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి సరదాగా డ్యాన్సు చేస్తున్న ప్రొ.ఛాన్సలర్ విష్ణు మంచు

హెచ్చరిక బోర్డును తొలగించిన గిరిజనులు



హెచ్చరిక బోర్డు తీసి కింద పడేసిన దృశ్యం

డక్కిలి, అక్టోబరు 4: రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును అధికారుల ముందే తొలగించి తగలపెట్టిన ఘటన డక్కిలి మండలం పలుగోడు సమీపంలో శుక్రవారం చోటుచేసుకొంది. అధికారుల కథనం మేరకు... పలుగోడు సర్వే నెంబరు 1, 123లో 1996లో అదే గ్రామానికి చెందిన చింతలబోయిన రమణయ్య కుటుంబానికి 7.30 ఎకరాల భూమికి ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. అయితే ఈ పట్టా చెల్లదంటూ గిరిజనులు గతంలో గూడూరు సబ్‌కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు విచారణ చేపట్టారు. అయితే విచారణలో తనకు న్యాయం జరగలేదంటూ బాధితుడు హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టు తీర్పు తనకు అనుకూలంగా వచ్చిందని, భూమిని తనకు అప్పగించాలంటూ రమణయ్య తహసీల్దారును కలిసి విజ్ఞప్తి చేశారు. అప్పటికే పలుగోడు గిరిజన కాలనీకి చెందిన కొంతమంది గిరిజనులు ఆ భూమిలో నిమ్మమొక్కలు తీసుకొచ్చి నాటేయడంతో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగింది. దీంతో సదరు భూమిలోకి ఎవ్వరూ ప్రవేశించరాదంటూ తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు వీఆర్వో ఆమని, వీఆర్ఏలు శుక్రవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీనిపై ఆగ్రహించిన ఓ గిరిజన సంఘ నాయకురాలు కొంత మంది గిరిజనులతో కలసి హెచ్చరిక బోర్డును రెవెన్యూ సిబ్బంది ఎదుటే తొలగించి తగలపెట్టారు. ఈ ఘనటపై వీఆర్వో ఆమని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు.

కష్టపడే వారిని పార్టీ గుర్తిస్తుంది: టీడీపీ



రవి నాయుడిని సన్మానిస్తున్న కేవీకే ప్రసాద్ నాయుడు

డక్కిలి, అక్టోబరు 4: టీడీపీ కోసం కష్టపడి పనిచేసే వారిని పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందనడానికి శాప్ ఛైర్మన్ రవి నాయుడే నిదర్శనమని తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు అన్నారు. మంగళగిరిలో శుక్రవారం శాప్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రవి నాయుడిని ప్రసాద్ నాయుడు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కృష్ణా యాదవ్, కాపు సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సాయికుమార్, తెలుగుయువత నాయకుడు దిలీప్ పాల్గొన్నారు.

ఆదిశంకర కళాశాలలో నవరాత్రి ఉత్సవాలు



కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు

గూడూరు, అక్టోబరు 4: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో శరన్నవరాత్రుల ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం కళాశాలలో నెల్లూరుకు చెందిన గురుకృపా కళాక్షేత్రం ఆధ్వర్యంలో సంగీతకచ్చేరి, నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ అంతరించిపోతున్న మన సంస్కృతి సంప్రదాయాలను, కళలను విద్యార్థులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వంకి అనూష, సౌరబ్, రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్నారుపోలూరు చెంగాళమ్మకు
వెండి ఆభరణాల బహూకరణ



సూళ్లూరుపేట, అక్టోబరు 4: సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు చెంగాళమ్మకు మాజీ కౌన్సిలర్, తెలుగు మహిళా నాయకురాలు బుద్ధి విజయలక్ష్మి దంపతులు వెండి ఆభరణాలు బహూకరించారు. శుక్రవారం ఆలయానికి చేరుకొని అర్చకులకు కిలో వెండి ఆభరణాలు, అమ్మవారికి చీర, గాజులు అందజేశారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



సందీప్‌కుమార్‌ను అభినందిస్తున్న డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, అక్టోబరు 4: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కోల్లూరు సందీప్‌కుమార్‌కు జేఎన్‌టీయూఏ డాక్టరేట్ అందజేసింది. శుక్రవారం ఆయనను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు. ఏ స్టడీ ఆన్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్ మోడిఫైడ్ విత్ ఫెర్రో సిలికా స్లాగ్ అగ్రిగేట్ అండ్ ఫారసింగ్ వాక్ క్యూరింగ్ కాంపౌండ్ అండ్ డవలప్‌మెంట్ ఆఫ్ ఆన్‌సిస్ మోడల్ అనే అంశంపై డాక్టర్ పీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ అరుణకాంతి పర్యవేక్షణలో సందిప్‌కుమార్ పరిశోధన చేశారు.

మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న రాజనేని రామానాయుడు ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు, అక్టోబరు 4: మండలంలోని కలవకొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో రాజనేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.4లక్షలతో నిర్మించనున్న మరుగుదొడ్లు, సానపు గదులకు ట్రస్టు ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి రాజనేని రామయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, ప్రజేంద్రరెడ్డి, బాబు, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, సుధాకర్ పాల్గొన్నారు.

ఇసుక సమస్య పరిష్కరించండి

వెంకగటగిరి టౌన్, అక్టోబరు 4: ఇసుక సమస్య పరిష్కరించాలని వెంకటగిరి నియోజకవర్గ సీపీఎం ఇన్‌ఛార్జి చెంగయ్య తహసీల్దార్ రాంబాబుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణాలు చేపట్టక కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

నాయుడుపేట ఎంపీడీవోగా సురేష్‌బాబు



సురేష్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 4: నాయుడుపేట ఎంపీడీవోగా సురేష్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ ఉద్యో గులు శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు.

పెళ్లకూరు ఎంపీడీవోగా ప్రమీలారాణి



ప్రమీలారాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

పెళ్లకూరు, అక్టోబరు 4: పెళ్లకూరు ఎంపీడీవోగా ప్రమీలారాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సూళ్లూరుపేట ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై పెళ్లకూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సురేష్‌బాబు నాయుడుపేటకు వెళ్లారు. ఏవో అన్నపూర్ణరావు, పంచాయతీ కార్యదర్శులు సమ్మన శ్రీహరి, మధుమోహన్ దాస్, శ్రీనివాసులు ఎంపీడీవోను కలసి అభినందనలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న కార్మిక సంఘ నాయకులు

నాయుడుపేట, అక్టోబరు 4: నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాను మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు సత్కరించారు. శుక్రవారం కమిషనర్‌ను కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్మికులకు వేతనాల బకాయిలను సత్వరమే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నెలవల హరికృష్ణ, మధు, వెంకటరత్నం, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సేవలు ప్రశంసనీయం



ప్రసన్న కుమారిని సన్మానిస్తున్న ఎంపీపీ, ఉద్యోగులు

డక్కిలి, అక్టోబరు 4: డక్కిలి నుంచి సంగంకు బదిలీపై వెళుతున్న ఎంపీడీవో ప్రసన్న కుమారిని ఎంపీపీ గోను రాజశేఖర్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీడీవో ప్రసన్న కుమారి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదలకు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపేవారని అభినందించారు. ఎంపీడీవోను ఎంఈవోలు జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, ఏపీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సత్కరించారు.

ఈవోపీఆర్‌డీగా మోహన్



గూడూరు అర్బన్, అక్టోబరు 4: గూడూరు మండల ఈవోపీఆర్‌డీగా మోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవోపీఆర్‌డీ రవి ఓజిలి మండలానికి బదిలీ కావడంతో ఓజిలి నుంచి మోహన్ గూడూరుకు వచ్చారు.

కాకాణికి కామిరెడ్డి అభినందనలు



గోవర్ధన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కామిరెడ్డి

పెళ్లకూరు, అక్టోబరు 4: ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎస్సీసీటీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారయణరెడ్డి, పెళ్లకూరు ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని కాకాణి నివాసంలో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలసి వెళ్లి గోవర్ధన్‌రెడ్డిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

గూడూరు అర్బన్, అక్టోబరు 4: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని విందూరు వీఆర్వో శివకుమార్ అన్నారు. శుక్రవారం తహసీల్దారు చంద్రశేఖర్ ఆదేశాల మేరకు విందూరులో గల ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.





గూడూరు: గాయత్రిదేవి అలంకరణలో నారాయణమ్మ, లక్ష్మీదేవిగా ద్రౌపదీదేవి - సూళ్లూరుపేట: గాయత్రీదేవి అలంకారంలో చెంగాళమ్మ

వేడుకగా శరన్నవరాత్రి ఉత్సవాలు

గూడూరు, అక్టోబరు 4: పట్టణంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక సాయి సత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో, నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవిని లక్ష్మీదేవిగా, బజారుకలిశంలో అమ్మవారిని ఆదిశక్తిగా అలంకరించి పూజలు చేశారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను శుక్రవారం ఉదయం పసుపుకొమ్ముల అలంకారంలో ఉంచి పూజలు జరిపారు. రాత్రి అన్నపూర్ణాదేవిగా అలంకంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్ధరథంపై గ్రామోత్సవం జరిపారు. కలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: శరన్నవరాత్రిల్లో భాగంగా పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. కన్యకా పరమేశ్వరిని రాజరాజేశ్వరిగా, మూలవిరాట్‌కు నెమలి ఈకల అలంకారం, హరహరక్షేత్రంలోని కాత్యయనీ దేవిని గాయత్రీదేవిగా, వెంకటేశ్వర స్వామిని కూర్మావతారంలో, వెలమపాళెంలోని మంద నాంచరీ దేవిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు భక్తులకు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. రెండోరోజు అమ్మవారికి సూళ్లూరు గంగమిట్ట, కాపువీధి, శ్రీనగర్ ప్రాంతవాసులు సారె సమర్పించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉన్న యాగశాల మండపంలో మహా చండీయాగం నిర్వహించారు. ఉభయకర్తలుగా గునపాటి మురళికృష్ణారెడ్డి, ప్రతిమ దంపతులు వ్యవహరించారు. సూళ్లూరుపేటలోని కన్యకాపర మేశ్వరి, నాగేశ్వరస్వామి ఆలయాల్లో శరన్నవరాత్రుల వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నాయుడుపేట: నాయుడుపేట అగ్రహారపేటలోని మానసాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికా దేవికి అభిషేకాలు, అష్టోత్తరపూజలు నిర్వహించారు. బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే దుర్గాదేవి, పోలేరమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతున్నాయి.

కోట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కోటలోని గ్రామ దేవత కోటమ్మను పూలతో అలంకరించారు. కోటలోని దుర్గాదేవిని తారాదేవిగా, గూడలిలోని చాముండేశ్వరిని గాయత్రీదేవి అలంకరించారు.






వెంకటగిరి టౌన్: కన్యకాపరమేశ్వరి మూలవిరాట్‌కు నెమలి ఈకల అలంకారం - చిల్లకూరు: ముత్యాలమ్మకు పసుపుకొమ్ముల అలంకరణ - నాయుడుపేట: బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో మూకాంబికాదేవి - కోట: గాయత్రీగాదేవిగా గూడలిలోని రామలింగ చాముండేశ్వరి

ప్రతిఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అశోకరాజు

నారాయణవనం, అక్టోబర్ 4: ప్రతి ఒక్కరు సనాతన ధర్మాన్ని పాటించాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోకరాజు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు సనాతన ధర్మంపై అవగాహన కల్పించారు. తమ కళాశాల నిర్మాణం పద్మావతి, కల్యాణ వెంకన్న నడయాడిన ప్రదేశంలో జరిగిందన్నారు. ఇటీవల తిరుమల లడ్డూ వివాదం తదితరాలను తట్టుకోలేకే సనాతన ధర్మంపై అవగాహన కల్పించాలని నిర్ణయించినట్టు తెలిపారు. భారతదేశం వసుదైక కుటుంబమని, సంప్రదాయాలను, సనాతన ధర్మాలను యావత్తూ ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ప్రాథమిక విద్య నుంచే సనాతన ధర్మాన్ని పాటించాలని కోరారు. తల్లిదండ్రుల పట్ల, గురువుల పట్ల భక్తిభావం కలిగేలా విద్యార్థి దశ నుంచే నేర్పించే విధంగా చొరవ తీసుకుంటామన్నారు. పార్టీలకతీతంగా, కులమతాలకతీతంగా సనాతన ధర్మాన్ని ప్రతి భారతీయుడు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన రాజు, రమేష్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే పాశం పరామర్శ



రాజగోపాలరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాశం

వాకాడు, అక్టోబరు 4: మండలంలోని పూడిరాయదొరువు గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచు యల్లబోతు రాజగోపాలరెడ్డిని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. రాజ గోపాలరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. డిశ్చార్జి అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శుక్రవారం పరామర్శించి ఆరోగ్య విషయాలను తెలుసు కున్నారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, కుంచం దయాకర్, బత్తిన ప్రమీల, మామిడి గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలి

గూడూరు, అక్టోబరు 4: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇసుక కొరత కార ణంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకపోవడంతో వారు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారన్నారు. గూడూరు పరిసర ప్రాంతాల్లోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుకను ఉచితంగా పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, శంకరయ్య, శ్రీనివాసులు, సురేష్, బీవీ రమణయ్య, చంద్రయ్య, మధు, ప్రసాద్, శేఖరాచారి, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూములపై చర్చలు

కోట, అక్టోబరు 4: కోట మండలం కొత్తపట్నంలోని వివాదాస్పద భూములపై తహసీల్దారు జయజయరావు రైతులతో శుక్రవారం చర్చలు జరిపారు. కొత్తపట్నం పంచాయతీలోని సర్వే నెంబరు 698, 699లో సుమారు 23 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి ఆయా భూములను చిల్లకూరు మండలం పల్లేవానిదిబ్బకు చెందిన కొంతమంది రైతులు, కోట మండలం యమదిన్నెపాళెం, గున్నంపడియ గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు సాగుచేసుకుంటున్నారు. చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ కోసం ఆ భూములు తీసుకోనుండడంతో పరిహారం విషయమై రెండు మండలాల రైతులతో తహసీల్దారు జయజయరావు చర్చలు జరిపారు. పరిహారం కోసం రైతుల పేర్లు నమోదుపై ఏకాభిప్రాయం రాకపోవడంతో రెవెన్యూ అధికారులు వెనుతిరిగారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం



మీడియాతో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఊహశ్రీ

వాకాడు, అక్టోబరు 4: వాకాడు ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలో 15 మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవచ్చని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఊహశ్రీ తెలిపారు. శుక్రవారం ఆమె వాకాడులోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్కిల్ స్టేషన్ పరిధిలోని వాకాడులో 4, చిట్టమూరు 4, కోటలో 7 మద్యం షాపులకు అనుమతి ఉందన్నారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రూ.2లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 11న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి లైసెన్స్‌లు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వాకాడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, బాలకృష్ణ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీయూలో అట్టహాసంగా మోహన మంత్ర



వేదికపై మంచు విష్ణు తదితరులు

చంద్రగిరి, అక్టోబరు 4: మండలంలోని ఎ.రంగంపేట సమీపంలో గల మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మోహన మంత్ర కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఎంబీయూ ప్రొ.ఛాన్సలర్ విష్ణు మంచు ప్రారంభించారు. చాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 20 వేలమందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. మంచు విష్ణు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, వారి మేధస్సును, నైపుణ్యాన్ని



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



విద్యార్థులతో కలిసి క్రీడల్లో పాల్గొన్న మోహన్‌బాబు

వెలికితీయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. టెక్నోహాలిక్, కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులతో కలిసి మంచు విష్ణు డ్యాన్సు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ చాన్సలర్ ఆచార్య నాగరాజ రామరావ్, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.